# జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

జనం రిపోర్టర్ జ జనం జన శ్రేయస్సే మా బాధ్యత

సంపుటి : 02 సంచిక : 09, ఎడిటర్: మార్పు సాయి కుమార్ పేజీలు : 08, వెల రూ. 5రూ/ గురువారం -08 - మే - 2025

Published From, Guntur : Circulatedat,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna,Kurnool ,Srikakulam, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad



విలేకరులు కావలెను

జనం రిపోర్టర్ తెలుగు దినపత్రిక

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా నడపబడుతున్న జనం రిపోర్టర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు

ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాల్లో జిల్లాల వారిగా రిపోర్టర్లు కావలెను.

అంకిత భావంతో పనిచేసేందుకు ఆసక్తి గలవారు

సంప్రదించండి: 9398 15 6948


## ఢిల్లీలో అమిత్ షా అత్యవసర సమీక్ష... నేడు అఖిలపక్ష సమావేశం

- పహల్గామ్ ఉగ్రదాడికి బదులుతీర్చుకున్న భారత్



- పీవోకేలోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు
- ఆపరేషన్ సింధూర్ విజయవంతం
- పాక్, నేపాల్ సరిహద్దు రాష్ట్రాలతో సీఎంలతో అమిత్ షా వీడియో కాన్ఫరెన్స్

## ఆపరేషన్ సింధూర్... ప్రధాని మోదీ నార్వే, క్రొయేషియా, నెదర్లాండ్స్ పర్యటన వాయిదా



ఆపరేషన్ సింధూర్ పేరిట పాక్ కు గట్టి హెచ్చరిక జారీ చేసిన భారత్

తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు, శిబిరాలను ధ్వంసం చేసిన భారత సైన్యం

కేంద్ర కేబినెట్ తో కీలక సమావేశం నిర్వహిస్తున్న మోదీ

2లో

## 'భారత సైన్యం లక్ష్యం పాక్ పౌరులు కాదు'

ఆపరేషన్ సింధూర్‌తో అమాయకుల ప్రాణాలు తీసిన వారిని మట్టుబెట్టాం

ఆపరేషన్ సింధూర్ తో శత్రువుకు తగిన విధంగా బుద్ధి చెప్పాం

2లో



'రైట్ టు రెస్పాండ్ హక్కును వాడుకున్నాం

పహల్గామ్ లో అమాయకుల ప్రాణాలు తీసిన వారు మూల్యం చెల్లించుకున్నారు






2లో

## ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం భారత్‌కు లేదు..

చైనా సహా ప్రపంచ దేశాలకు దోభాల్ స్పష్టం

పరిస్థితులను తీవ్రతరం చేసేలా పాక్ వ్యవహరిస్తే.. భారత్ నుంచి ప్రతిస్పందన మరింత గట్టిగా ఉంటుంది

### రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి

## పరిస్థితి వివరించిన ప్రధాని మోదీ

- ఉగ్ర స్థావరాలపై దాడుల అనంతరం రాష్ట్రపతితో ప్రధాని సమావేశం
- 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాక్, పీఓకేలో 9 ఉగ్ర స్థావరాలు ధ్వంసం
- లష్కరే, జైషే ఉగ్రసంస్థల ప్రధాన కార్యాలయాలు, శిక్షణా కేంద్రాలే లక్ష్యం
- పహల్గామ్ దాడి జరిగిన రెండు వారాల తర్వాత ఈ సైనిక చర్య
- భారత్‌పై దాడుల కుట్రలను భగ్నం చేయడమే లక్ష్యమని వెల్లడి

ఢిల్లీ: పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సాయుధ దళాలు బుధవారం తెల్లవారుజామున కచ్చితమైన దాడులు నిర్వహించాయి. ఈ కీలక పరిణామం అనంతరం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రపతి భవన్‌లో మిగతా.. 2లో



# పాక్‌కు లెక్క సరిచేసింది..!

- పఠాన్ కోట్ నుంచి రియాసీ దాడి వంటి పెద్ద కుట్రలకు కేంద్రాలుగా నిలిచిన శిక్షణ శిబిరాలను మొత్తంగా నేలమట్టం
- మసూద్ ఇల్లు.. జైషే ప్రధాన కేంద్రం..
- లష్కరే హెడ్‌క్వార్టర్.. ఇదో పెద్ద ఉగ్ర యూనివర్సిటీ..
- 'ఆపరేషన్ సిందూర్'.. పేరులోనే మొత్తం మెసేజ్..!
- పాక్ ఎస్ఎస్‌జీ కమాండోలతో ట్రైనింగ్..

ఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో భారత్‌కు సహనం నశించింది. ఆ ఉగ్రమూక అమాయకుల ప్రాణాలు తీయడమే కాక.. మీ ప్రధానికి వెళ్లి చెప్పండనడంతో ఇక వారిని ఏమాత్రం ఉపేక్షించకూడదని నిర్ణయించుకొంది. పఠాన్ కోట్ నుంచి రియాసీ దాడి వంటి పెద్ద కుట్రలకు కేంద్రాలుగా నిలిచిన శిక్షణ శిబిరాలను మొత్తంగా నేలమట్టం చేసింది.

### మసూద్ ఇల్లు.. జైషే ప్రధాన కేంద్రం..




బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్. ఇది సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. జైషే మహ్మద్‌కు దీనిని ఆపరేషనల్ హెడ్‌క్వార్టర్‌గా అభివర్ణిస్తారు. పుల్వామా దాడి సహా భారత్‌పై చాలా కుట్రలు ఇక్కడే పురుడు పోసుకున్నాయి. మసూద్ అజార్ సన్నిహితులు ఈ కేంద్రం నుంచి ఆత్మాహుతి దాడులకు శిక్షణ ఇవ్వడం, ప్లానింగ్ వంటివి చేశారు. దీనిని జైషే చీఫ్ మసూద్ ఇంటిగా కూడా వినియోగిస్తాడు. ప్రస్తుతం జైషే నెంబర్-2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబసభ్యులు కూడా దీనిలో ఉంటున్నారు. 600 మంది ఉగ్రవాదుల ఇళ్లు కూడా ఈ క్యాంపస్‌లోనే ఉన్నట్లు తెలుస్తోంది. మిగతా.. 2లో

### కర్రెగుట్టల్లో ఎదురు కాల్పులు..

## 26 మంది మావోయిస్టులు మృతి

ఈ ఆపరేషన్‌ను డీఆర్జీ, కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఏఎఫ్ బలగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి

అల్లూరి జిల్లాలో ఎదురుకాల్పులు.. నలుగురు మావోయిస్టులు మృతి



చర్ల: తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ మేరకు అధికార వర్గాలు వెల్లడించాయి. ఘటనా స్థలంలో కాల్పులు కొనసాగుతున్నాయి. ఈ ఆపరేషన్‌ను డీఆర్జీ, కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఏఎఫ్ బలగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. దీన్ని ఏడీజీ వివేకానంద సిన్హా పర్యవేక్షిస్తున్నారు. సీఆర్పీఎఫ్ ఐజీ రాకేశ్ అగర్వాల్, బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందరరాజ్ మిగతా.. 2లో



2లో

## భారత్ దాడులతో పాకిస్థాన్‌లో తీవ్ర కలకలం: రెడ్ అలర్ట్

భారత్ వైమానిక దాడుల నేపథ్యంలో పాకిస్థాన్‌లో రెడ్ అలర్ట్

జాతినుద్దేశించి ప్రసంగం చేయనున్న ప్రధాని షెహబాజ్ షరీఫ్

జాతీయ భద్రతా కమిటీ సమావేశం

దాడుల్లో 26 మంది మృతి, 46 మందికి గాయాలైనట్టు పాక్ సైన్యం ప్రకటన

# ఇలాంటి సమయంలో రాజకీయాలకు తావులేదు

హైదరాబాద్: 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో సైన్యంతో మనమంతా ఉన్నామనే సందేశం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి సమయంలో రాజకీయాలకు తావు లేదన్నారు. అత్యవసర సేవలు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు, మంత్రులు, అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు. మంత్రులు, అధికారులు విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగులు మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు




తీసుకుంటామని హెచ్చరించారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్‌ఫ్రీ నంబర్ సిద్ధం చేయాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించనున్నారు. నగరంలోని సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ఇది కొనసాగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర నేతలు పాల్గొననున్నారు.

# ఉగ్రవాదంపై పోరులో ప్రధాని మోదీకి అండగా ఉంటాం

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదు, పాకిస్థాన్‌కు గుణపాఠం తప్పదు
- ప్రధాని మోదీ నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు, చివరి ఉగ్రవాదిని ఏరివేసే వరకు అండ
- సోషల్ మీడియాలో దేశ వ్యతిరేక ప్రచారం చేస్తే కఠిన చర్యలు, సెలబ్రిటీలకూ హెచ్చరిక
- రాష్ట్రంలో దేశ వ్యతిరేక శక్తులపై ఉక్కుపాదం, డీజీపీకి పవన్ ఆదేశాలు
- ఏపీ తీరప్రాంత భద్రతపై అప్రమత్తత అవసరం, గత అనుభవాలు గుర్తుంచుకోవాలి



అమరావతి: దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకునే ప్రతి సాహసోపేత నిర్ణయానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. తన నివాసంలో నేడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై మాట్లాడారు. కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమన్నది కాదనలేని సత్యమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పాలని, ఇది పూర్తిస్థాయి యుద్ధం కాకపోయినా, సుదీర్ఘకాలం కొనసాగే పోరాటమని ఆయన అభిప్రాయపడ్డారు. మన సైనిక, రక్షణ సిబ్బంది మిగతా.. 2లో

### భారత సాయుధ దళాలకు

# నా సెల్యూట్..




- మన దేశం తనను తాను రక్షించుకుంటుందని సైన్యం నిరూపించిందన్నచంద్రబాబు
- మోదీ నిర్ణయాత్మక నాయకత్వంపై ప్రశంసలు
- దేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉందన్న ఏపీ సీఎం

అమరావతి: పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై విజయవంతంగా దాడులు చేసినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారత సాయుధ దళాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పహల్గామ్ ఉగ్రదాడికి వేగంగా ప్రతీకారం తీర్చుకున్న భారత సాయుధ దళాల యోధులకు నేను గర్వంగా సెల్యూట్ చేస్తున్నాను. వారి అసమాన మిగతా.. 2లో



2లో

## ఆపరేషన్ సిందూర్..

- పాకిస్థాన్‌లోని తమ పౌరులకు అమెరికా అడ్వైజరీ
- 'ఆపరేషన్ సింధూర్' నేపథ్యంలో పాకిస్థాన్‌లోని అమెరికా పౌరులకు హెచ్చరిక
- భారత్-పాక్ నియంత్రణ రేఖ వద్దకు వెళ్లొద్దని యూఎస్ రాయబార కార్యాలయం సూచన
- పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పౌరులకు సలహా
- ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిలుపు



### ఉగ్రవాదులను అంతం చేయాల్సిందే...

## ఉగ్రవాద శిబిరాలపై దాడులు అనివార్యం

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం ముఖ్యమైన కర్తవ్యమన్న జగన్

ఉగ్ర చర్యలను మన రక్షణ దళాలు తిప్పికొట్టాయని వ్యాఖ్య

ఆపరేషన్ సిందూర్ అనివార్యమైన చర్య అన్న వైసీపీ అధినేత

అమరావతి: దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు, ఉగ్రవాదుల దాడుల నుంచి పౌరులను రక్షించేందుకు చేపట్టే చర్యల్లో భాగంగా 'ఆపరేషన్ సిందూర్' వంటివి అనివార్యమని వైఎసీపీ అధినేత, మిగతా.. 2లో

# భారత్‌కు సహనం నశించింది..
# పాక్‌కు లెక్క సరిచేసింది..!

### లష్కరే హెడ్‌క్వార్టర్.. ఇదో పెద్ద ఉగ్ర యూనివర్సిటీ..

మురిద్కేలోని మర్కాజ్ తోయిబా. సరిహద్దుకు 30 కిలోమీటర్ల దూరంలోని లష్కరే క్యాంపు కార్యాలయం ఇది. దాదాపు 82 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఉగ్ర క్యాంపస్ ఇది. ఇందులో మదర్సా, మార్కెట్ వంటివి కూడా ఉన్నాయి. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడంలో ఈ క్యాంపస్‌దే కీలక పాత్ర. ఇది లష్కరే హెడ్‌క్వార్టర్‌గా పనిచేస్తోంది. దాదాపు 1000 మంది వరకు ఇక్కడ ఉగ్ర శిక్షణ పొందుతున్నారు. దీని నిర్మాణానికి 2000 సంవత్సరంలో అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్ 10 మిలియన్ డాలర్లు డొనేషన్‌గా ఇచ్చాడు. 26/11 ఉగ్రదాడికి పాల్పడిన దుర్మార్గుల్లో ఒకడైన అజ్మల్ కసబ్‌కు ఇక్కడే ఇంటెలిజెన్స్ శిక్షణ ఇచ్చారు. ఈ దాడి కుట్రదారులు డేవిడ్ కోల్‌మన్ హెడ్లీ, తహవ్వూర్ రాణా ఈ కేంద్రాన్ని సందర్శించారు. లష్కరే సిద్ధాంతకర్తలు అమిర్ హమ్జా, అబ్దుల్ రెహ్మాన్ అబ్ది, జాఫర్ ఇక్బాల్ ఈ ప్రాంగణంలోనే నివాసం ఉంటున్నారు. లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్, జకీర్ రహ్మాన్ లఖ్వీలకు ఇక్కడ ఇళ్లు ఉన్నాయి.

సొరంగాల కేంద్రం..

తెహ్రా కలాన్‌లోని సర్జల్ క్యాంప్. జైషే మహ్మద్ ఉగ్ర స్థావరం ఇది. దీన్ని కూడా జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను పంపించేందుకు ఉపయోగిస్తున్నారు. భారత్‌లోని సాంబా సెక్టర్‌కు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. భారత్‌లోకి రహస్య సొరంగాలు తవ్వేందుకు ఇది కేంద్రంగా ఉంది. షకర్‌గర్ ప్రాంతాన్ని లష్కరే, జైషేలు సొరంగాల నెట్‌వర్క్‌గా మార్చేశాయి. భారత్‌లోకి ఆయుధాలు, మత్తు పదార్థాలు రవాణా చేసేందుకు ఇది ప్రధాన లాంచ్‌ప్యాడ్. ఇక్కడ కంట్రోల్ రూమ్ కూడా ఉంది. వీటిల్లో హిజ్బుల్ ముజాహిద్దీన్ రేడియో రిసీవర్లు, కమ్యూనికేషన్ సెంటర్లు ఉన్నాయి. జైషే కమాండర్లు ఇక్కడికి వచ్చి వెళుతుంటారు. ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్‌కు ఇక్కడ పారా గ్లైడింగ్‌లో శిక్షణ కూడా ఇచ్చారు. పఠాన్ కోట్ ఎయిర్ బేస్‌పై దాడి చేసిన ఉగ్రవాదులకు జైషే కమాండర్ షాహిద్ లతీఫ్ ఇక్కడే బ్రెయిన్ వాష్ చేశాడు.

హిజ్బుల్ కీలక కేంద్రం..

సియల్‌కోట్‌లోని మెహమూనా జోయా క్యాంప్. అంతర్జాతీయ సరిహద్దుకు 15 కి.మీ. దూరంలో ఉన్న హిజ్బుల్ ముజాహిద్దీన్ శిబిరం ఇది. దీనికి చుట్టూ నివాస భవనాలు ఉన్నాయి. దీనికి మోహద్ ఇర్ఫాన్ ఖాన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇతడు 1995లో జమ్మూలోని మౌలానా ఆజాద్ స్టేడియంలో వరుస పేలుళ్లకు పాల్పడ్డాడు. నాడు గవర్నర్ కేవీ కృష్ణారావు త్రుటిలో ఈ దాడుల నుంచి బయటపడ్డారు. ఈ ఉగ్ర స్థావరంలో దాదాపు 50 మంది ఉండేందుకు వీలుగా ఏర్పాట్లు ఉన్నాయి. ఎల్లప్పుడూ ఇక్కడ దాదాపు 20-25 మంది ఉంటారు.

లష్కరే లాంచ్ ప్యాడ్..

బర్నాలలోని మర్కాజ్ అహ్లే హదిత్ ఉగ్ర స్థావరం. ఇది లష్కరే తోయిబా ఉగ్ర క్యాంప్. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని భింబెర్ జిల్లాలో




ఉంది. ఇక్కడ 150 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు ఉన్నాయి. ఎప్పుడూ కనీసం 40 మంది ఉంటారు. ఈ కేంద్రాన్ని లష్కరే కమాండర్ ఖాసీం గుజ్జర్, అనాస్‌జరార్ నిర్వహిస్తున్నారు. పూంఛ్-రాజౌరి-రియాసీ సెక్టార్‌లోకి లష్కరే ఉగ్రవాదులు, ఆయుధాలను పంపించేందుకు దీన్ని వినియోగిస్తున్నట్లు సమాచారం.

జైషే ఆయుధాగారం..

కోట్లిలోని మర్కాజ్ అబ్బాస్ ఉగ్ర స్థావరం. నియంత్రణ రేఖకు 35 కి.మీ. దూరంలో ఈ క్యాంప్ ఉంది. కోట్లీ మిలిటరీ క్యాంప్‌నకు కేవలం రెండు కిలోమీటర్ల దూరంలో దీనిని నిర్వహించడం గమనార్హం. ఇక్కడ 125 మంది శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఏ సమయంలోనైనా కనీసం 50 మంది ఉంటారు. హాఫీజ్ అబ్దుల్ షకూర్ అలియాస్ ఖారీజరార్ ఈ కేంద్రానికి హెడ్. జైషే వ్యవస్థాపక సభ్యుల్లో ఒకడు. గతంలో హర్కత్ ఉల్ ముజాహిద్దీన్‌లో పనిచేశాడు. 2016 నగ్రోటాలోని బాలెనీ ఆర్మీ క్యాంప్‌పై దాడిలో ఇతడి హస్తం ఉన్నట్లు ఎన్ఐఏ వెల్లడించింది. పఠాన్‌కోట్ ఉగ్రదాడి తర్వాత జైషే తన ఆయుధాలు, మందుగుండును దశాకా మర్కజ్ నుంచి తరలించి ఇక్కడ నిల్వ చేయడం మొదలుపెట్టింది. అవసరమైనప్పుడు షకూర్ స్వయంగా ఆయుధాలను తన వాహనంలో సియాల్‌కోట్‌కు తరలిస్తాడు. 2023 ఏప్రిల్ 20న పూంఛ్‌లో జరిగిన దాడులకు, జూన్ 24న బస్సులో ప్రయాణిస్తున్న అమాయక యాత్రికులపై దాడికి ఇక్కడి ఉగ్రవాదులే కారణం అని సమాచారం.

ఉగ్రవాదులకు పర్వత యుద్ధతంత్రంలో ఇక్కడే శిక్షణ..

కోట్లిలోని మస్కర్ రహీల్ షహీద్. పీఓకేలో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన స్థావరం ఇది. దాదాపు 200 మందికి ఉగ్ర శిక్షణ ఇచ్చేలా దీనిని నిర్మించారు. ప్రస్తుతం అక్కడ 30 మంది వరకు ఉండొచ్చని అంచనా. తుపాకీల వినియోగం, శారీరక దృఢత్వంపై శిక్షణ ఇస్తారు. దీంతోపాటు బోర్డర్ యాక్షన్ టీమ్, స్నైపింగ్ టెక్నిక్‌లు కూడా నేర్పిస్తారు. ఉగ్ర విద్యార్థులను కొండల్లోకి తీసుకెళ్లి.. పర్వత యుద్ధ తంత్రాల్లో శిక్షణ ఇస్తారు. హిజ్బుల్ చీఫ్ సయ్యద్ సలాహుద్దీన్ దీనికి అధిపతి. అతడే కొత్త ఉగ్రవాదులకు ఇక్కడ స్వాగతం పలుకుతాడని పేరుంది. అంతేకాదు శిక్షణను కూడా అతడే పర్యవేక్షిస్తాడు.

'ఆపరేషన్ సిందూర్'.. పేరులోనే మొత్తం మెసేజ్..!

కొండల ప్రాంతంలో ఉండే ఈ క్యాంప్‌లో నాలుగు గదులు, బ్యారక్‌లు ఉన్నాయి. వీటిలో పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఉన్నట్లు సమాచారం. వీటితోపాటు ఉగ్రవాదులకు బ్రెయిన్ వాష్ చేసేందుకు అవసరమైన ప్రచార సామగ్రి పెద్దఎత్తున ఇక్కడ నిల్వ చేస్తారు.

### లష్కరే శిక్షణ కేంద్రం..

ముజఫరాబాద్‌లోని షవాయ్ నాలా క్యాంప్. ఇది 2000 సంవత్సరం నుంచి పనిచేస్తోంది. దీనికి హుజైఫా బిన్ యెమెన్, బైత్ ఉల్ ముజాహిద్దీన్ అనే పేర్లు కూడా ఉన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తంగ్ధర్ సెక్టార్‌లో సరిహద్దుకు 30 కిలోమీటర్ల పరిధిలో షవాయ్ లష్కరే క్యాంప్ ఉంది. ఈ ముఠాకు కీలకమైన క్యాంప్ ఇది. లష్కరే కమాండర్ అబు దుజానా దీనికి ఇన్‌ఛార్జి.

పెద్దఎత్తున లష్కరే క్యాడర్ ఇక్కడ నివాసం ఉంటోంది. వీరిలో కమాండర్లు, శిక్షకులు ఉన్నారు. లష్కరేలో చేరిన వారిని ఇక్కడ తరచూ హాఫీజ్ సయీద్ వచ్చి ఆహ్వానం పలుకుతాడు. ఇక్కడ అత్యధికంగా 250 మందికి ట్రైనింగ్ ఇచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఎప్పుడూ 50-100 మంది ఉంటారు. ఫిజికల్ శిక్షణతోపాటు.. జీపీఎస్ వాడటం, మ్యాప్ రీడింగ్, ఆయుధ వినియోగం, ప్రత్యేకమైన ఆయుధాల వాడకంపై శిక్షణ ఇస్తారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ కార్యకలాపాలు కూడా ఇక్కడ చురుగ్గానే ఉంటాయి. వీరికి అవసరమైన ఆయుధాలను పాక్ సైన్యం సమకూరుస్తుంది. 26/11 ఉగ్ర దాడుల్లో పాల్గొన్న కసబ్ ఇక్కడ కూడా శిక్షణ పొందాడు.

### పాక్ ఎస్ఎస్‌జీ కమాండోలతో ట్రైనింగ్..

ముజఫరాబాద్‌లోని సైద్నా బిలాల్ ఉగ్ర స్థావరం. పీఓకేలోని జైషే ప్రధాన కేంద్రాల్లో ఇది ఒకటి. ముఫ్తీ అస్గర్ ఖాన్ కశ్మీరీ దీనికి అధిపతి. భారత్ నుంచి పారిపోయిన.. ఆసిక్ నెంగ్రూ, జైషే కమాండర్ అబ్దుల్ జిహాదీలు కూడా ఈ క్యాంప్‌ను వాడుకొన్నారు. ముజఫరాబాద్ రెడ్‌ఫోర్ట్‌కు ఎదురుగా ఉంటుంది. ఇక్కడికి వచ్చేవారికి పాక్ ఎస్ఎస్‌జీ కమాండోలు శిక్షణ ఇస్తారు. జమ్మూకశ్మీర్‌లోకి ఉగ్రవాదులను తరలించేందుకు వీలుగా దీన్ని రవాణా క్యాంప్‌గా నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎప్పుడూ 50-100 మంది ఉగ్రవాదులు ఉంటారని సమాచారం.

## కర్రెగుట్టల్లో ఎదురు కాల్పులు..
# 26 మంది మావోయిస్టులు మృతి

మొదటి పేజి తరువాయి

బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందరరాజ్ ఎప్పటికప్పుడు ఆపరేషన్‌పై ఆరా తీస్తున్నారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

అల్లూరి జిల్లాలో ఎదురుకాల్పులు.. నలుగురు మావోయిస్టులు మృతి

మరోవైపు, ఏపీలోని అల్లూరి జిల్లా వై.రామవరం, జీకేవీధి మండలాల సరిహద్దుల్లో భద్రతాబలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ క్రమంలోనే రెండు ఏకే-47లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఘటనాస్థలంలో ఇరుపక్షాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి
# పరిస్థితి వివరించిన ప్రధాని మోదీ

మొదటి పేజి తరువాయి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో చేపట్టిన ఈ సైనిక చర్యకు సంబంధించిన వివరాలను ప్రధాని రాష్ట్రపతికి వివరించారు. ఈ దాడుల్లో భాగంగా, పాకిస్తాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న లష్కరే తోయిబా (ఎల్ఈటీ), జైషే మహ్మద్ (జేఈఎం) వంటి ఉగ్రవాద సంస్థలకు చెందిన తొమ్మిది కీలక స్థావరాలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. ధ్వంసం చేసిన వాటిలో ఉగ్రవాద సంస్థల ప్రధాన కార్యాలయాలు, శిక్షణా కేంద్రాలు కూడా ఉన్నాయని తెలిసింది. భారతదేశంపై ఉగ్రదాడులకు ప్రణాళికలు రచించడం, వాటిని నిర్దేశించడం వంటి కార్యకలాపాలు ఈ కేంద్రాల నుంచే జరుగుతున్నాయన్న పక్కా సమాచారంతోనే సైన్యం ఈ దాడులు చేపట్టింది. రెండు వారాల క్రితం జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో ఒక నేపాల్ దేశస్థుడితో సహా 26 మంది అమాయక పౌరులు మరణించిన సంగతి తెలిసిందే. ఈ దారుణ ఘటన జరిగిన అనతికాలంలోనే భారత సాయుధ దళాలు ఈ ప్రతిదాడులకు దిగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదని భారత్ మరోసారి స్పష్టం చేసినట్లయింది.

## ఉగ్రవాదులను అంతం చేయాల్సిందే...
# ఉగ్రవాద శిబిరాలపై దాడులు అనివార్యం

మొదటి పేజి తరువాయి

వంటివి అనివార్యమని వైఎస్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకులు, రీజినల్ కోఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఈ భేటీకి ముందు కొందరు ముఖ్య నేతలతో ఆయన 'ఆపరేషన్ సిందూర్' గురించి ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... ఉగ్రవాద స్థావరాలు, వారి శిక్షణ శిబిరాలపై దాడులు చేయడం అనేది దేశ రక్షణలో కీలకమైన భాగమని అభిప్రాయపడ్డారు. "దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం, ఉగ్రవాదుల దాడుల నుంచి తన పౌరులను రక్షించుకోడం అన్నది దేశానికి అత్యంత ముఖ్యమైన కర్తవ్యం" అని ఆయన స్పష్టం చేశారు. కశ్మీర్‌లోని పహల్గామ్ లో అమాయకులైన పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని జగన్ తీవ్రంగా ఖండించారు. ఇది మానవత్వంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఇటువంటి క్రూరమైన ఉగ్ర చర్యలను భారత రక్షణ దళాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని ప్రశంసించారు. "అలాంటి ఉగ్ర చర్యలపై భారత రక్షణ దళాలు గట్టిగా స్పందించాయి. ఆపరేషన్ సిందూర్ అనివార్యమైన చర్య. భారత రక్షణ బలగాలకు యావత్‌దేశం అండగా నిలుస్తుంది" అని జగన్ తెలిపారు. దేశ పౌరుల భద్రత లక్ష్యంగా రక్షణ బలగాలు తీసుకుంటున్న ప్రతి చర్యకు దేశం మొత్తం మద్దతుగా ఉంటుందని ఆయన అన్నారు.

## భారత సాయుధ దళాలకు
# నా సెల్యూట్..

మొదటి పేజి తరువాయి

వారి అసమాన ధైర్యం, కచ్చితత్వంతో, ఉక్కు సంకల్పంతో మన దేశం తనను తాను రక్షించుకుంటుందని వారు మళ్లీ నిరూపించారు" అని చంద్రబాబు పేర్కొన్నారు. పాకిస్థాన్, పీవోకేలో దాడుల తర్వాత భారత సాయుధ దళాలను ప్రశంసించిన మొదటి రాజకీయ నాయకులలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకరు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో దేశభక్తితో కూడిన 'జై హింద్!' అంటూ తన మద్దతు ప్రకటించారు. సాయుధ దళాల విజయాన్ని గుర్తించిన తొలి స్వరాలలో ఇది ఒకటి. తరువాతి పోస్ట్‌లో సాయుధ దళాల అసాధారణ ధైర్యాన్ని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాత్మక నాయకత్వాన్ని చంద్రబాబు ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు పూర్తి మద్దతును వ్యక్తం చేస్తూ, మోదీ నిర్ణయాత్మక నాయకత్వాన్ని ప్రశంసిస్తూ "ఈ రోజు, గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రపంచం మన బలం, దృఢ సంకల్పాన్ని చూసింది. మన దేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉంది. మన సాయుధ దళాలకు మద్దతు ఇస్తుంది" అని ప్రకటించారు.

## ఉగ్రవాదంపై పోరులో ప్రధాని మోదీకి అండగా ఉంటాం
## ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

మొదటి పేజి తరువాయి



మన సైనిక, రక్షణ సిబ్బంది చేస్తున్న సేవలను ప్రశంసించిన పవన్, దేశ రక్షణ విషయంలో వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. "గౌరవ ప్రధానమంత్రి మోదీ గారి నాయకత్వంలో, మీరు తీసుకునే ప్రతి నిర్ణయానికి, ప్రతి సాహసోపేత చర్యకు మేమంతా అండగా ఉంటాం" అని పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వానికి, సైన్యానికి భరోసా ఇచ్చారు. సోషల్ మీడియాలో జరిగే దేశ వ్యతిరేక ప్రచారంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "సోషల్ మీడియాలో ఏ విధమైన దేశ వ్యతిరేక ప్రచారం జరిగినా, దాన్ని తిప్పికొట్టాలి. అలాంటి వాటిని సంబంధిత సైబర్ క్రైమ్ విభాగాల దృష్టికి తీసుకెళ్లి కేసులు నమోదు చేయించాలి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎవరైనా దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, లేదా ఈ యుద్ధ వాతావరణానికి వ్యతిరేకంగా మాట్లాడితే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీకి ఇప్పటికే సూచించినట్లు ఆయన వెల్లడించారు. "దేశం లోపలైనా, బయటి నుంచి అయినా దేశంపై జరిగే ఏ దాడిని అయినా తీవ్రంగా పరిగణిస్తాం" అని హెచ్చరించారు. సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు జాతీయ భద్రత, సైన్యం వంటి సున్నితమైన అంశాలపై అవగాహన లేకుండా వ్యాఖ్యలు చేయవద్దని పవన్ కల్యాణ్ హితవు పలికారు. బాధ్యతా రహితంగా మాట్లాడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "దేశ సరిహద్దులను ఎలా కాపాడుకోవాలో తెలియకుండా, సోషల్ మీడియాలో అనవసర వ్యాఖ్యలు చేయవద్దు. ఇది నా విజ్ఞప్తి" అని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు 974 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం ఉందని, గతంలో విశాఖపట్నం తీరం వరకు పాకిస్థాన్ గజనీ సబ్‌మెరైన్ వచ్చిన ఘటనను గుర్తు చేస్తూ, తీరప్రాంత భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పవన్ నొక్కిచెప్పారు. "గత యుద్ధాల సమయంలో ఇలాంటి ఘటనలు జరిగాయి. కాబట్టి తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని సూచించారు. ఉగ్రవాద దాడులపై కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను పవన్ కల్యాణ్ ప్రస్తావిస్తూ, దాడికి మూడు రోజుల ముందే సమాచారం ఉందని తెలిస్తే ఇన్నాళ్లూ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. "ఆ సమాచారం నిజంగానే ఉంటే, అప్పుడే మీడియా ముందు ఎందుకు వెల్లడించలేదు? కొంతకాలం తర్వాత, బాగా ఆలోచించి ఇప్పుడు ఎందుకు ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు?" అని పవన్ నిలదీశారు. కాంగ్రెస్ నేతల వైఖరిలో స్పష్టత కొరవడిందని విమర్శించారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని, ఇజ్రాయెల్ తరహాలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడమే దీనికి మార్గమని పవన్ అభిప్రాయపడ్డారు. రోహింగ్యాల వలసల అంశాన్ని ప్రస్తావిస్తూ, మానవతా దృక్పథంతో వలసలను అర్థం చేసుకోవచ్చని, అయితే స్థానికుల ఉద్యోగాలు, వనరులపై ప్రభావం పడితే భవిష్యత్తులో సమస్యలు తలెత్తుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి దారితీసిన పరిస్థితులను ఆయన ఉదాహరణగా చూపారు. "ప్రతి దేశం తమ సరిహద్దులను కాపాడుకోవాలి, తమ పౌరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి. భారతదేశం అభివృద్ధి చెందుతోందని ఇతర దేశాలు తమ పౌరులను ఇక్కడికి పంపించడాన్ని మనం భరించలేం" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. దేశాన్ని నడిపేది రాజకీయ నాయకులే తప్ప సెలబ్రిటీలు కాదని, సెలబ్రిటీలకు అనవసర ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని పవన్ అన్నారు. దేశ సమస్యలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన ఉన్న రాజకీయ నాయకులే దేశాన్ని నడిపిస్తారని ఆయన పేర్కొన్నారు. చివరి ఉగ్రవాదిని దేశం నుంచి ఏరివేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని, ఈ విషయంలో తామంతా కేంద్ర ప్రభుత్వానికి అండగా ఉంటామని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.

## ఆపరేషన్ సిందూర్ బ్రీఫింగ్...
## ఎవరీ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్?



ఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్థాన్, పీవోకేలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ దాడులపై భారత రక్షణ, విదేశాంగ శాఖ మీడియాకు బ్రీఫింగ్ ఇచ్చింది. కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఆపరేషన్ గురించి మీడియాకు వివరించారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ చిన్నప్పటి నుంచే పైలట్ కావాలని కలలు కన్నారు. చదువుకునే రోజుల్లోనే ఆమె ఎన్.సీ.సీలో చేరారు. ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసి భారత వైమానిక దళంలో హెలికాప్టర్ పైలట్ గా తన కెరీర్ ను ప్రారంభించారు. 2019 డిసెంబర్ 18న ఆమె ఫ్లయింగ్ బ్యాచ్ లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లోని ఎత్తైన ప్రాంతాలతో పాటు అత్యంత సవాళ్లతో కూడిన ప్రాంతాల్లో ఆమె చేతక్, చీతా హెలికాప్టర్లను నడిపారు. ఎన్నో రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొన్నారు.

## ఆపరేషన్ సిందూర్..
## పాకిస్థాన్‌లోని తమ పౌరులకు అమెరికా అడ్వైజరీ

ఢిల్లీ: భారతదేశం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం పాకిస్థాన్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా, అక్కడున్న తమ దేశ పౌరులకు అమెరికా ప్రభుత్వం కీలక సూచనలు జారీ చేసింది. పాకిస్థాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సాయుధ దళాల మధ్య ఘర్షణలు తలెత్తే ఆస్కారం ఉన్నందున, భారత్-పాకిస్థాన్ మధ్య ఉన్న నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) సమీప ప్రాంతాలకు ప్రయాణాలు పెట్టుకోవద్దని తమ పౌరులను హెచ్చరించింది. పాకిస్థాన్‌లోని పరిస్థితులను, ఇరు దేశాల గగనతలాల మూసివేత వంటి పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని అమెరికా అధికారులు తెలిపారు. దాడులు జరిగిన ప్రాంతాలకు దగ్గరగా నివసిస్తున్న వారు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లి ఆశ్రయం పొందాలని సూచించారు. అంతేకాకుండా, వివాదాస్పద ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారు తమ ప్రయాణ ప్రణాళికలను రద్దు చేసుకోవాలని అడ్వైజరీలో స్పష్టం చేశారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ జరిపిన దాడుల అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఈ ఘర్షణ వాతావరణానికి వీలైనంత త్వరగా తెరపడాలని ఆయన ఆకాంక్షించారు. "రెండు శక్తిమంతమైన దేశాల మధ్య యుద్ధాన్ని ఎవరూ కోరుకోరు. భారత్, పాకిస్థాన్‌లకు గొప్ప చరిత్ర ఉంది. వాటి మధ్య అనేక ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, ప్రపంచానికి శాంతి మాత్రమే కావాలి. ఘర్షణలు వద్దు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. మరోవైపు, అమెరికాలోని భారత రాయబార కార్యాలయం ఈ దాడులపై వివరణ ఇచ్చింది. "ప్రాణాలతో బయటపడిన వారి సాక్ష్యాధారాలు, సాంకేతిక సమాచారం ఆధారంగానే భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు చేపట్టింది. ఇందుకు స్పష్టమైన ఆధారాలున్నాయి. ఈ దాడుల్లో అక్కడి పౌర ఆవాసాలు, ఆర్థిక వనరులు లేదా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదు. కేవలం ఉగ్రవాద శిబిరాలపైనే దాడులు జరిగాయి" అని భారత రాయబార కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, 'ఆపరేషన్ సిందూర్' అనంతరం పాకిస్థాన్ ప్రభుత్వం భారత రాయబారికి సమన్లు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

## ఢిల్లీలో అమిత్ షా అత్యవసర సమీక్ష...
## నేడు అఖిలపక్ష సమావేశం

ఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ తో పాకిస్థాన్ పై దెబ్బకు దెబ్బతీసిన భారత్ తదుపరి చర్యలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దేశ రాజధాని ఢిల్లీలో అత్యవసర సమీక్ష చేపట్టారు. పాక్, నేపాల్ సరిహద్దు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సీఎస్ లు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం అయ్యారు. ఈ సమీక్ష సమావేశానికి జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, సిక్కిం సీఎంలు హాజరయ్యారు. లఢఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కూడా ఈ సమీక్షలో పాల్గొన్నారు.

నేడు ఉదయం 11 గంటలకు అఖిలపక్ష భేటీ

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నేడు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో మే 8వ తేదీ ఉదయం 11 గంటలకు ఈ సమావేశం జరగనుంది. ఆపరేషన్ సిందూర్ వివరాలను కేంద్రం ఈ అఖిలపక్ష సమావేశంలో పంచుకోనుంది.

## వంద పాకిస్థాన్ లకు సమాధానం చెప్పే మిస్సైల్ మన దగ్గరుంది

అమరావతి: పహల్గామ్ ఉగ్ర దాడులకు భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఆపరేషన్ సిందూర్ పేరుతో చేపట్టిన ఆపరేషన్ తో పాక్, పీవోకేలోని తొమ్మిది ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసింది. ఇందులో జైషే మొహమ్మద్ కేంద్ర కార్యాలయం కూడా ఉంది. ఈ దాడిలో జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10 మంది ప్రాణాలు కోల్పోయారు. పాక్ పై భారత్ చేసిన దాడిపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఇటీవల అమరావతి సభలో తాను ప్రధాని మోదీ సమక్షంలో చేసిన వీడియోను ఆయన నేడు ఎక్స్ లో పంచుకున్నారు. "పాకిస్థాన్ గీత దాటింది. అమాయకులను చంపింది. చాలా పెద్ద తప్పు చేసింది. ఒక పాకిస్థాన్ కాదు... వంద పాకిస్థాన్ లు వచ్చినా భారతదేశంపై మొలచిన గడ్డి కూడా పీకలేరు. వంద పాకిస్థాన్ లకు సమాధానం చెప్పే ఒక్క మిస్సైల్ మన దగ్గర ఉంది. ఆ మిస్సైల్ ఏంటో తెలుసా? 'నమో'. గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ గారు" అని లోకేశ్ భావోద్వేగంతో మాట్లాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా వీడియోను షేర్ చేశారు.

## ఆపరేషన్ సిందూర్... ప్రధాని మోదీ నార్వే,
## క్రొయేషియా, నెదర్లాండ్స్ పర్యటన వాయిదా

**ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్ కు గట్టి హెచ్చరిక జారీ చేసిన భారత్**

ఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ కు ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం గట్టి సమాధానం ఇచ్చింది. ఈ తెల్లవారుజామున పాకిస్థాన్ ప్రధాన భూభాగంతో పాటు పీఓకేలో ఉన్న తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు, శిబిరాలను క్షిపణులతో ధ్వంసం చేసింది. ఇప్పటి వరకు భారత్ దాడులకు పాకిస్థాన్ వైపు నుంచి ఎలాంటి ప్రతిస్పందన రాలేదు. మరోవైపు, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధాని మోదీ తన మూడు దేశాల పర్యటనను వాయిదా వేసుకున్నారు. నార్వే, క్రొయేషియా, నెదర్లాండ్స్ లో ప్రధాని పర్యటించాల్సి ఉంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఆయన తన విదేశీ పర్యటనలను వాయిదా వేసుకున్నారు. ఈ పర్యటనలు మళ్లీ ఎప్పుడు జరుగుతాయనే విషయం ఇంకా వెల్లడి కాలేదు. మరోవైపు కేంద్ర కేబినెట్ తో మోదీ కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ భేటీ అనంతరం కేంద్ర ప్రభుత్వం నుంచి ఆపరేషన్ సిందూర్ పై ప్రకటన వెలువడనుంది.

## 'భారత సైన్యం లక్ష్యం పాక్ పౌరులు కాదు'

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌తో అమాయకుల ప్రాణాలు తీసిన వారిని మట్టుబెట్టామని కేంద్ర రక్షణశాఖమంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ తో శత్రువుకు తగిన విధంగా బుద్ధి చెప్పామన్నారు. బుధవారం ప్రెస్ మీట్ లో మాట్లాడిన రాజ్ నాథ్ సింగ్.. 'రైట్ టు రెస్పాండ్ హక్కును వాడుకున్నాం. భారత సైనం తన సత్తాను చాటింది. అత్యంత కచ్చితత్వంతో కూడిన దాడులు చేశాం. పహల్గామ్ లో అమాయకుల ప్రాణాలు తీసిన వారు మూల్యం చెల్లించుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశ శత్రువులకు తగిన విధంగా బుద్ధి చెప్పాం. హనుమంతుడినే ఆదర్శంగా తీసుకున్నాం. భారత సైన్యం లక్ష్యం పాక్ పౌరులు కాదు.. ఉగ్రవాదుల స్థైర్యాన్ని దెబ్బతీశాం. ఆపరేషన్ సిందూర్‌తో రికార్డు సృష్టించాం. పాక్ పౌరుల ప్రాణాలకు ముప్పు కలగకుండా ఉగ్రస్థావరాల్ని ధ్వంసం చేశాం' అని ఆయన పేర్కొన్నారు. కాగా, ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా ఇండియన్ ఆర్మీ బుధవారం అర్ధరాత్రి చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దాయాది పాకిస్థాన్‌కు భయం పుట్టిస్తోంది. ప్రధానంగా జైషే మహ్మద్, లష్కరే తోయిబా ప్రధాన స్థావరాలను లక్ష్యంగా చేసుకొని వాటిని కూల్చివేసింది. విజయవంతంగా జరిపిన ఈ 'ఆపరేషన్ సిందూర్'లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు చావు దెబ్బ తగిలినట్లు సమాచారం. జైషే ముఠాకు చెందిన ఓ స్థావరంపై జరిగిన దాడిలో 14 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది. ఇందులో 10 మంది మసూద్ కుటుంబసభ్యులేనని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. బవహల్పూర్ లోని జైష్-ఎ-మహమ్మద్, మురిద్కే కేంద్రంగా ఉన్న లష్కర్-ఎ-తొయిబా క్యాంపులపై ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ జరిపిన దాడుల్లో దాదాపు 90 మంది ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోంది..

## ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం భారత్‌కు లేదు..

ఇంటర్నెట్ డెస్క్: 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం దాడులు జరిపిన విషయం గురించి భారత జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ ఇతర దేశాలకు వెల్లడిస్తూ.. వారి మద్దతు కూడగడుతున్నారు. ఇందులో భాగంగా ఆయన చైనా విదేశాంగ మంత్రితో మాట్లాడారు. పరిస్థితులను తీవ్రతరం చేసేలా పాక్ వ్యవహరిస్తే.. భారత్ నుంచి ప్రతిస్పందన మరింత గట్టిగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశం మాత్రం తమకు లేదని వెల్లడించారు. ఇదే విషయాన్ని అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ దేశాల భద్రతా సలహాదారులు, కార్యదర్శులకూ డోభాల్ వివరించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై తీసుకున్న చర్యలు.. ఆపరేషన్ నిర్వహించడానికి గల కారణాలను ఆయన ప్రపంచ దేశాలకు వివరించినట్లు అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అక్కడి ఉగ్రవాదుల శిబిరాలపై దాడుల అమలు వివరాలు వారికి చెప్పినట్లు సమాచారం. భారత మిత్రదేశాలతో భవిష్యత్తులోనూ సమాచారం పంచుకుంటామని అన్నారు. ఇప్పటి వరకు ఆయన 8 దేశాల ప్రతినిధులతోనూ చర్చలు జరిపారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడింది. పాక్‌లోని 4, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5 స్థావరాలపై దాడులు చేసింది. అంతర్జాతీయ సరిహద్దుకు 30 కి.మీ. దూరంలో ఉన్న లష్కరే తోయిబాకు చెందిన గుల్పూర్ టెర్రర్ క్యాంప్ సహా 9 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని.. భద్రతా బలగాలు క్షిపణులు ప్రయోగించాయి. రాజౌరి - పూంఛ్ ప్రాంతాల్లో ఇందులోని ఉగ్రవాదులు యాక్టివ్‌గా ఉన్నారు. ఇక్కడే 2023, 2024లో పూంఛ్ దాడుల్లో కీలకంగా వ్యవహరించిన ఉగ్రవాదులు ట్రైనింగ్ పొందినట్లు తమకు సమాచారం ఉన్నట్లు భారత అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు అక్కడ 80 మంది వరకు ఉగ్రవాదులు మృతి చెందినట్లు వార్తలొస్తున్నాయి. బవహల్పూర్(జైషే మహమ్మద్), మురిద్కే (లష్కరే తొయిబా) క్యాంపుల్లోనే అత్యధిక మంది ఉగ్రవాదులు చనిపోయినట్లు తెలుస్తోంది.

## భారత్ దాడులతో పాకిస్థాన్‌లో తీవ్ర కలకలం: రెడ్ అలర్ట్

ఢిల్లీ: భారత వైమానిక దాడుల నేపథ్యంలో పాకిస్థాన్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా రెడ్ అలర్ట్ ప్రకటించిన ప్రభుత్వం, ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ మరికొన్ని గంటల్లో జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. దేశంలోని ప్రభుత్వ ఆసుపత్రులను అత్యవసర సేవల కోసం సిద్ధం చేశారు. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను కనీసం 24 నుంచి 36 గంటల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. రాజధాని ఇస్లామాబాద్‌తో పాటు పంజాబ్ ప్రావిన్స్‌లోని అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. సాయుధ బలగాలన్నీ అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మంగళవారం రాత్రి జరిగిన ఈ వైమానిక దాడుల్లో కనీసం 26 మంది మరణించారని, మరో 46 మంది గాయపడ్డారని పాకిస్థాన్ ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి తెలిపారు. పాకిస్థాన్ వెర్షన్ ప్రకారం ఆ దేశంలోని ఆరు వేర్వేరు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. వీటిలో పాకిస్థాన్‌లోని దక్షిణ పంజాబ్ ప్రావిన్స్‌లోని బహవల్‌పూర్ నగరానికి చెందిన అహ్మద్‌పూర్ షర్కియా ప్రాంతంలోని మసీదు సుభానల్లా కూడా ఉంది. ఇది జైషే మహ్మద్ (జెఈఎం) చీఫ్ మౌలానా మసూద్ అజర్ రహస్య స్థావరమని ఆరోపణలున్నాయి. అలాగే, లష్కరే తోయిబా (ఎల్ఈటీ), జమాత్ ఉద్ దవా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు చెందిన మురిద్కేలోని ప్రధాన కార్యాలయం, రహస్య స్థావరంతో పాటు ముజఫరాబాద్, కోట్లి, బాగ్ పట్టణాల్లోని ఇతర ప్రాంతాలపై కూడా పలు దాడులు జరిగినట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం జాతినుద్దేశించి ప్రసంగించనున్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, దేశంలో నెలకొన్న భద్రతా పరిస్థితిపై చర్చించేందుకు, భారత్‌పై భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు తన నివాసంలో జాతీయ భద్రతా కమిటీ (ఎన్ఎస్‌సీ) అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

## పాఠశాల అభివృద్ధి పనులను పకడ్బందీగా పూర్తి చేయాలి.....

### సమీకృత గురుకులాల నిర్మాణ పనులు ప్రారంభించాలి.... -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష...



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ పాఠశాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో టి.జి.ఈ. డబ్ల్యూ.ఐ.డి.సి అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించారు. టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి ద్వారా పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులు, యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. జిల్లాలో మాడల్ స్కూల్స్, గురుకులాలు, జడ్పి ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలో



టి.జి.ఈ. డబ్ల్యూ.ఐ.డి.సి ద్వారా చేపట్టిన అదనపు తరగతులు, సైన్స్ ల్యాబ్ నిర్మాణం, కాంపౌండ్ వాల్ వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వం మంజూరు చేసిన యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణ పనులు ప్రారంభించాలని , నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని అన్నారు. రామగుండం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిన్నోవేషన్ పనులు పూర్తి చేయాలని అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం క్రింద గోదావరిఖని పీజీ కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు టెండర్ ఒప్పందం పూర్తి చేసుకుని, మే 20 నాటికి పనులు ప్రారంభించాలని అన్నారు.జిల్లాలో చేపట్టిన చిల్డ్రన్ హోమ్ నిర్మాణంలో పురోగతి సరిగ్గా లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తయ్యేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. కోటి పది లక్షల రూపాయలతో చేపట్టే ఐటిఐ ఇన్నోవేషన్ పనుల టెండర్లు పూర్తి చేసి 5 నెలల వ్యవధిలో పూర్తి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో ఈఈ టి.జి.ఈ. డబ్ల్యూ.ఐ.డి.సి అనితా శింగనాథ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంతో తప్పిన పెను ప్రమాదం..



పొన్నూరు ( జనం రిపోర్టర్ ) : గుంటూరు జిల్లా పొన్నూరు జడ్పీ పాఠశాలలో బుధవారం పురపాలక సంఘం, అలింకో సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాలకై ఎంపిక శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు అధ్యక్షత వహించారు. శిబిరం అనంతరం పురపాలక సంఘం వారు ఏర్పాటు చేసిన భోజనాలు జరుగుతుండగా ఒక్కసారిగా మబ్బులు కమ్మి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి పక్కనే ఉన్న చెట్టుకొమ్మ విరిగి టెంటు పై పడింది. అప్పటికే దివ్యాంగులను, వయోవృద్ధులను సిబ్బంది పాఠశాల భవనంలోకి తరలించారు. వర్షం బీభత్సానికి ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు..

## ఒక్కరికి కూడా బాధ్యత లేదు సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం.



పొన్నూరు మే 7. జనం రిపోర్టర్:గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం జడ్పీ పాఠశాలలో బుధవారం అలింకో, పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరం జరిగింది. ఈ శిబిరంలో సచివాలయ వెల్ఫేర్ సిబ్బంది, ఇతర సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో కమిషనర్ ఎం. రమేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టం వచ్చినట్లు వచ్చి వెళ్ళటం కాదని బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని నెల నెల జీతాలు తీసుకుంటున్నాం అని సిబ్బందిని మందలించారు. ఆలస్యంగా వచ్చిన వారి పేర్లు నమోదు చేసుకొని చర్యలు తీసుకోవాలని ఆర్వో వెంకటేశ్వరరావు కు సూచించి సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. శాఖాపరమైన చర్యలు తప్పమని హెచ్చరించారు..

## ఇష్టంతో కొలిస్తే కష్టాలు తొలగుతాయి



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : వరంగల్ నగర పరిధిలోని 66వ డివిజన్ హసన్ పర్తి లో ఈరోజు విశ్వమాత జగత్ జనని ఆది పరాశక్తి పార్వతి దేవి అవతారమైన వాసవి కన్య కాపరమేశ్వరి అందరికీ ఆరాధ్య దైవమని ఇష్టంతో కొలిస్తే కష్టాలన్నీ తొలగుతాయని కోరిన కోరికలను తీర్చే చల్లని తల్లి అని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వరరావు అన్నారు వాసవి క్లబ్ హసన్పర్తి ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల కులదైవ్యం వాసవి మాత జయంతి వేడుకలు స్థానిక లక్ష్మీ ఫంక్షన్ హాల్ లో క్లబ్ అధ్యక్షులు సంద్రు నాగేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పురోహితుల ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఈ క్లబ్ సేవలు



అభినందనీయమని విద్య వైద్యం పై ప్రత్యేక దృష్టితో ముందుకు సాగాలన్నారు ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చీదర పురవర్ధన్, కోశాధికారి నాగమల్ల మాధవ శంకర్, జిల్లా జాయింట్ సెక్రెటరీ అప్పని శంకర్, మాజీ అధ్యక్షులు గౌరీశెట్టి కృష్ణమూర్తి, బెలిదే లక్ష్మణ్, మంతెన శ్యాంసుందర్,చిధర కరంచందర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు పడకంటి జ్యోతి, సంద్రు నిరోషా, కట్కర్ రాద, అనుగం పద్మావతి, తదితరులు పాల్గొన్నారు

# పట్టణాభివృద్ధి పనులు కట్టు దిట్టంగా చేపట్టాలి.....

### తడి చెత్త పోడి చెత్త సేకరణ పై విస్తృత ప్రచారం కల్పించాలి... పట్టణంలో ఆస్తి పన్ను 6 కోట్లకు పెంచుకునేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు...జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 07. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే పట్టణ అభివృద్ధి పనులను కట్టుదుట్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పెద్దపల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద త్రాగు నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, సీవరేజి లైన్ మొదలగు మౌలిక వసతుల పనులు పూర్తి చేశామని అన్నారు. త్రాగు నీటి సరఫరా పకడ్బందిగా ప్రతి ఇంటికి జరుగుతుందో లెదో పరిశీలించి, 15 రోజులలో అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఇంటికి లబ్ధిదారుని పేరు పై విద్యుత్ మీటర్ కనెక్షన్ ఇవ్వాలని, మే 20 నాటికి లబ్ధిదారులకు ఇండ్లు అందించేందుకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి 2 బీ.హెచ్.కే ఇంటికి పైప్ లైన్ ద్వారా త్రాగు నీరు అందాలని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద 25 కిలో మీటర్ల పైప్ లైన్, 3 ట్యాంకులు, 2 వేల ఇండ్లకు కనెక్షన్ మంజూరు జరిగిందని, వీటిని సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. పట్టణంలో



చేపట్టిన సిసి రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనుల పై నివేదిక అందించాలని అన్నారు. రాబోయే 10 సంవత్సరాలలో పట్టణ ప్రగతిని అంచనా వేస్తూ ప్రతి రోజు త్రాగునీటి సరఫరా చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ సూచించారు.వేసవి కాలంలో పట్టణంలో ఎక్కడా కూడా త్రాగు నీరు ఇబ్బంది రావద్దని, మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకొవాలని కలెక్టర్ సూచించారు. మే చివరి నాటికి పెద్దపల్లి పట్టణంలో ఎక్కడా డార్క్ స్పాట్ లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పెద్దపల్లి టౌన్ లో కమర్షియల్ కార్యకలాపాలు జరుగుతున్న భవనాలు, ప్రజల నివాసాల నుంచి వసూలు చేసే ఆస్తి పన్నును సమీక్షించుకోవాలని, సంవత్సరానికి కనీసం 6 కోట్ల రూపాయల ఆస్తిపన్ను వసూలు జరిగేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పట్టణంలో ఉన్న లేఔట్ ప్రతిపాదనల పై కలెక్టర్ చర్చించారు. పట్టణంలో ఎక్కడా కూడా అక్రమ లెఔట్ ఉండటానికి వీలు లేదని కలెక్టర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మున్సిపాలిటీ నుంచి తీసుకున్న అనుమతి కంటే అధికంగా ఫ్లోర్ నిర్మించే వారి పై చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని అన్నారు.పారిశుధ్య నిర్వహణ పై కలెక్టర్ సమీక్షిస్తూ, తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం పై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని అన్నారు. డిసెంబర్ 31 వరకు 100% సేగ్రిగేషన్ సాధ్యం కావాలని అన్నారు. ప్రజల ముందే చెత్త వెసి తడి చెత్త, పోడి చెత్త వేరు చేయడంలో మున్సిపల్ సిబ్బంది పడుతున్న ఇబ్బందులను చూపించాలని వేరు వేరుగా చేసి మున్సిపల్ సిబ్బందికి అందించే ప్రజలను సన్మానించాలని అన్నారు.పట్టణంలో ఎక్కడా విద్యుత్ 3వ వైర్ లేకుండా ఉండటానికి వీలు లేదని అన్నారు. పట్టణంలో 3వ విద్యుత్ వైర్ పెండింగ్ ఉన్న చోట్ల వెంటనే చేపట్టాలని అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి పనుల్లో భాగంగా అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్ షిఫ్టింగ్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ అధికారులతో విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మన భారతదేశంలో అక్రమ చొరబాటు దారుల గురించి చర్యలు తీసుకోవాలి

### కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : భారతీయ జనతా పార్టీ హసన్ పర్తి మండల శాఖ తరపున, మండల అధ్యక్షులు మారం తిరుపతి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ నాయకులతో కలిసి హసన్ పర్తి డిప్యూటీ తహశీల్దార్కి వినతిపత్రం అందజేయడం జరిగింది. అనంతరం 66 డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న దాడిని ఖండిస్తూ ప్రస్తుతం దేశ భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్తులో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు అక్రమంగా ఉంటున్న వలసదారులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.హసన్ పర్తి మండల పరిధిలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాల రోహింగ్యా ముస్లింలు మరియు ఇతర అరబ్ దేశాల నుండి అక్రమంగా చొరబడిన విదేశీయులను గుర్తించి,తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే, వీరి సమాచారాన్ని రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలకు అందజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మారపల్లి రామచంద్రారెడ్డి, వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి,రైల్వే బోర్డు మెంబర్ మేకల హరిశంకర్ , మాజీ ఎర్రగట్టు దేవస్థానం చైర్మన్ పెద్దమ్మ శ్రీనివాస్,మాజీ మండల అధ్యక్షులు గుర్రాల చంద్రమౌళి,మండల ఉపాధ్యక్షులు బలగని రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిలు కోయేడ రాజు, శంకర్,మహిళా మోర్చా నాయకులు ఉమాదేవి, సీనియర్ నాయకులు గంట సత్యం,మట్టెడ సుమన్, రాజేందర్, రమేష్, తిప్పన్న, శ్రీనివాస్, రవి మండల పదాధికారులు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదం అంతం.. మోడీజీ పంతం ఆపరేషన్ సింధూరపై దేశ ప్రజల హర్షం



రేపల్లె. ( జనం రిపోర్టర్ ) : ఉగ్రవాదాన్ని అంతం చేయడమే ప్రధాని నరేంద్ర మోడీ పంతమని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ అన్నారు. పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరిట చేసిన దాడులను స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయంతో భారతదేశ సైనికుల సత్తా ప్రపంచానికి మరోసారి తెలిసిందని అన్నారు. టెర్రరిస్టు స్థావరాలపై మన దేశ సైనికులు చేసిన దాడి దృశ్యాలను ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారని తెలిపారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం కోసం మోడీ అనుసరిస్తున్న విధానాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్ దాడులతో ఉగ్రవాదులకు భారత్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసిందని అన్నారు. ఉగ్రవాదం ఏ స్థాయిలో ఉన్న అణచివేసేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని తెలిపారు. పహల్గాం కిరాతక దాడి దేశ ప్రజలను కలచివేసిందని, కిరాతక ఉగ్రవాదులను అణచివేసే దిశగా ప్రభుత్వం దాడులు నిర్వహించటం అభినందనీయమన్నారు. అమాయకులపై దాడి చేసిన ఉగ్రవాదులను, అంతమెందించేలా భారత్ చేసిన దాడులకు ప్రపంచ దేశాలన్నీ మద్దతు తెలపటం, దేశానికే గర్వకారణం అన్నారు. సాధారణ పౌరులకు హాని కలిగించకుండా దాడులు చేసి ముష్కరులకు సరైన సమాధానం ఇచ్చిందని తెలిపారు. ఉగ్రవాదుల స్థావరాలపై ప్రజలకు హాని కలగకుండా ఖచ్చితమైన ప్రాంతాల్లో దాడులు చేయడం మన దేశ టెక్నాలజీ, శక్తి సామర్థ్యాలు ప్రపంచ దేశాలకు తెలిశాయని అన్నారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించి దేశంలో అంతర్గత కలహాలు సృష్టించాలని ప్రయత్నించిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను భారత ప్రజలు కుల మతాలకతీతంగా సమైక్యంగా ఆపరేషన్ సింధూరతో తిప్పి కొట్టారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ ఉపకరణాలు అందిస్తాం.. జిల్లా ఏడి సువార్త



పొన్నూరు ( జనం రిపోర్టర్ ) : గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణం జడ్పీ పాఠశాల ఆవరణంలో బుధవారం అలింకో , పొన్నూరు పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాల కై ఎంపిక శిబిరం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు అధ్యక్షత ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా డిజేబుల్ వెల్ఫేర్ ఏడి సువార్త పాల్గొని మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులు వయోవృద్ధులకు అలింకో సహకారంతో అవసరమైన ఉపకరణాలు అందిస్తామని శిబిరంలో అర్హులైన దివ్యాంగులు వయోవృద్ధులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సహకారంతో వచ్చేనెల అర్హులైన వారందరికీ ఎమ్మెల్యే చేతుల మీదగా ఉపకారణాలు అందిస్తామని తెలిపారు. ఉపకరణాలు అవసరం కలిగిన వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకుని రసీదు పొందాలన్నారు. కార్యక్రమంలో హెచ్ డబ్ల్యు ఓ సతీష్ కుమార్, సచివాలయ వెల్ఫేర్, వైద్య సిబ్బంది ,మున్సిపల్ సిబ్బంది , వైద్య , ఐఈఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## పొన్నూరులో శ్రీ వాసవి మాత జయంతి.



పొన్నూరు ( జనం రిపోర్టర్ ) :అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం పొన్నూరు అంబేద్కర్ సెంటర్ వద్ద శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా తాటికొండ వెంకట శివరామకృష్ణ వారి షాపు నందు అమ్మవారి జయంతి కార్యక్రమం జరిగింది .ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం గుంటూరు జిల్లా మాజీ అధ్యక్షులు బాపనపల్లి లక్ష్మీ ప్రభాకర్ ప్రసాదరావు పాల్గొని మహిమానిత అమ్మవారిని స్మరించుకొనటం జీవిత పుణ్యఫలమని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు పొన్నూరు పట్టణం పై ఎల్లవేళలా ఉండాలని కోరారు. అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు అందించారు.అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రధాన కార్యదర్శి కొమ్మూరు భీమేశ్వరరావు, కోశాధికారి తాటి కొండ ఉమామహేశ్వరరావు, బవిరిశెట్టి వెంకటేశ్వర్లు, చీమకుర్తి కళాధర్ రావు ,తాత ప్రసాద్ రావు ,వి శ్రీనివాస, పలువురు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## క్యాంటీన్ ను సందర్శించి భోజనం చేసిన డి ఆర్ డి ఓ కాళిందిని...



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 07. సమీకృత కలెక్టరేట్ లో మహిళా శక్తి కార్యక్రమం లో భాగంగా ఏర్పాటు చేసిన ఈశ్వరా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను డి ఆర్ డి ఓ కాళిందిని సందర్శించి, క్యాంటీన్ లో భోజనం చెయ్యడం జరిగింది. క్యాంటీన్ భోజనం రుచికరంగా ఉన్నది అని కలెక్టరేట్ కు, వచ్చే సందర్శకులకు కలెక్టరేట్ సిబ్బందికి అందుబాటు ధరలలో రుచికరమైన భోజనం అందించాలి అని, క్యాంటీన్ పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి అని క్యాంటీన్ నిర్వాహకులకు సూచించడం జరిగింది.

## ఘనంగా అంకమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు






నిజాంపట్నం ( జనం రిపోర్టర్ ) : నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెం గ్రామంలోవెం చేసియున్న శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి 8వ వార్షికోత్సవ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన వార్షికోత్సవ వేడుకల్లో గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు కూడా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా అమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆలయం అభివృద్ధి కొరకు విరాళం అందచేసిన రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ మాత్యులు అనగాని సత్య ప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్ అందజేశారుఈ కార్యక్రమంలో కేసన శంకరరావు, తాతా ఏడుకొండలు, నర్రా సుబ్బయ్య, కొలసాని రాము, కేసన రామకృష్ణ, మైల నరేష్, బొర్రావారిపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు...

## మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు

నిజాంపట్నం ( జనం రిపోర్టర్ ) : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలు నిజాంపట్నం మండలంలో గౌరవ ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారుఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను ఎంపీడీవో తెలియజేశారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో . ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు మోడీ శ్రీనివాసరావు మరియు అన్ని పంచాయతీల కార్యదర్శిలు పాల్గొన్నారు

## మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా



ప్రత్తిపాడు ప్రతినిధి, ( జనం రిపోర్టర్ ) : ప్రత్తిపాడు నియోజకవర్గం వట్టి చెరుకూరు మండల పరిధి లోని పుల్లడి గుంట వద్దగల మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళాను 09-05-2025 తేదీన ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో జరగనున్నట్లు కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్ళు అన్నారు. ఈ రోజుల్లో ఉద్యోగం పొందడం చాలా కష్టంగా మారిందని, ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నియోజకవర్గ ఎమ్మెల్యే, రిటైర్డ్ ఐఏఎస్ బూర్ల రామాంజనేయులు మెగా జాబ్ మేళా తమ కళాశాలలోఏర్పాటు చేయించడం ఎంతో సంతోషకరమైన విషయని అన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని పలుచుకోవాలని సూచించారు.నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ, రాష్ట్ర ఉన్నత విద్యా మరియు ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్, తన పాదయాత్రలో లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ.ఇచ్చారని, ఆ హామీని అమలు చేయడంలో భాగంగా ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు . ఈ జాబ్ మేళాకు సుమారు 40 పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొనన్నట్లు, తద్వారా సుమారు 1500 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించబడతాయన్నారు. ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు నెలసరి వేతనం కనీసం రూ.10,000 నుంచి గరిష్ఠంగా రూ.45,000 వరకు ఉండనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు అర్హత సాధించిన వారికి సదరు సంస్థల నుంచి అభిప్రాయాలను సేకరించి, వారు బలహీనంగా ఉన్న విషయాలపై ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రతినిధులు,కళాశాల ప్రిన్సిపల్, డైరెక్టర్, డీన్లు, విభాగాధిపతులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## రామగుండం ని మోడల్ సిటీగా, స్థానికంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా కృషి చేస్తున్నాం....



రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 07. రామగుండం నగరాన్ని అందమైన నగరంగా రూపొం దించడమే కాకుండా స్థానికంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా కృషి చేస్తున్నామని రామగుండం శాసన సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు.బుధవారం ఒకటవ డివిజన్ అబాది రామగుండంలో ఎన్ టి పి సి సి ఎస్ ఆర్ నిధులు రూ 6.00 లక్షలతో ఆర్ ఓ ప్లాంట్ నిర్మాణ పనులకు , 14.00 లక్షలతో వైకుంఠ ధామం ప్రహారీ గోడ నిర్మాణ పనులకు ప్రభుత్వ సలహాదారు ( ప్రోటోకాల్ ) హర్కార వేణు గోపాల్ రావు తో కలిసి శంకుస్థాపన చేసి శిలా ఫలకం ఆవిష్కరించారు. ఈ సంధర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మంత్రివర్యులు శ్రీధర్ బాబు , ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల రావు , జిల్లా లోని పొరుగు నియోజకవర్గాల ఎమ్మెల్యే ల సహకారంతో సంయుక్తంగా కృషి చేసి, రామగుండంలో విద్యుత్ ప్లాంట్ తో పాటు 45 వేల కోట్ల రూపాయల విలువైన వివిధ ప్రాజెక్ట్ లను తీసుకురావడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ సలహాదారు ( ప్రోటోకాల్ ) హర్కార వేణు గోపాల్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమపథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) అరుణ శ్రీ , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్ , తాజా మాజీ కార్పొరేటర్ బొంతల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేపల్లె రైల్వే స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన డిఆర్ఎం

### మూడు నెలల్లో అన్ని పనులు పూర్తిచేస్తామన్న డిఆర్ఎం

### స్టేషన్ మాస్టర్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన డిఆర్ఎన్






.రేపల్లె ( జనం రిపోర్టర్ ) : ప్రయాణికుల సౌకర్యార్థం రేపల్లె రైల్వే స్టేషన్ ను అభివృద్ధి పరచడం జరుగుతుందని డిఆర్ఎం సుదర్శన్ సేమ్ అన్నారు బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ కు తనిఖీ నిమిత్తం వచ్చిన డిఆర్ఎల్ స్టేషన్ పరిసర ప్రాంతాలను జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలన చేశారు మరో మూడు నెలల్లో అభివృద్ధి పనులన్నీ పూర్తి అవ్వడం జరుగుతుందని తెలియజేశారు రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని ఆమె తెలియజేశారుఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి సంఘం కార్యదర్శి మోహన్ రావు వినతి పత్రం అందజేశారు వినతిపత్రంలోగుంటూరు రైల్వే డివిజన్ లోని రేపల్లెకు అదనపు రైల్వే సౌకర్యములు కల్పించ వలసినదిగా కోరుచున్నాముఅని తెలియజేశారు 1) రేపల్లె-తెనాలి-రేపల్లె .మధ్య ప్రతి గంటకు ఒక రైలు నడువలసినదిగాను 2) 17626 డెల్టా ను సికింద్రాబాద్ కు ఉదయం 5 గంటలకు, లింగంపల్లికి ఉదయం 5.30 గంటలకు చేరుటకు గాను, 3) 12747, 12748 పల్నాడు లను రేపల్లె-వికారాబాద్-రేపల్లె మధ్య నడుపుటకుగాను,4) 17243, 17244 రాయగడ్ లను రేపల్లె-రాయగడ్-రేపల్లె మధ్య నడుపుటకుగాను5) 17261, 17262 తిరుపతిలను రేపల్లె-తిరుపతి-రేపల్లె మధ్య నడుపుటకుగాను,6) 20701, 20702 సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ లను, జిల్లా కేంద్రమైన లో ఆపుటకుగాను,7) 67213, 67214 పాసింజర్ లను విజయవాడ-రేపల్లె- విజయవాడ మధ్య నడుపుటకు గాను,8) 67221, 67222 ప్యాసింజర్ లను విజయవాడ-రేపల్లె- విజయవాడమధ్య నడుపుటకు గాను 9) రేపల్లె రైల్వే స్టేషన్ ఏరియాలో "పిట్ "సౌకర్యం కల్పించుటకు గాను,10) మచిలీపట్నం-రేపల్లె-నిజాంపట్నం-బాపట్ల రైల్వే లైన్ ఏర్పాటు చేయుటకుగాను,11) రేపల్లె- తెనాలి మధ్య 2వ లైన్ ఏర్పాటు చేయుటకుగాను, ఈ సమస్యలు పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకొన వలసినదిగా మిమ్ములను మా సంఘం తరపున కోరుచున్నాము.అని తెలియజేశారు డి ఆర్ ఎం వెంట రైల్వే సిబ్బంది అధికారులు పాల్గొన్నారు

## విద్యుత్ షాక్ తో మహిళ మృతి



రేపల్లె. ( జనం రిపోర్టర్ ) : రేపల్లె పట్టణలోని ఇసుకపల్లి 17 వ వార్డ్, నివాసి అయిన మోపిదేవి సుమతి %ఖ/శీ% వెంకట శివ నాగేశ్వర రావు, 41 సంవత్సరములు అను ఆమె బుధవారం ఉదయము షుమారు 7 గంటల సమయుములో ఆమె ఇంటి ప్రక్కన గల నిమ్మ చెట్లకు నీళ్ళు పోస్తు ఉండగా నిమ్మ చెట్టు ప్రక్కనే ఉన్న కరెంట్ పోల్ కు ఆనుకుని ఉండడము వలన నిమ్మ చెట్టుకు కరెంట్ వచ్చి మోపిదేవి సుమతి కరెంట్ షాక్ తగిలి క్రింద పడి పోయింది అది గమనించిన ఆమె భర్త వెంటనే రేపల్లె ప్రభుత్వ హాస్పిటల్ కి తీసుకువెళ్ళరు డాక్టర్ చూసి చనిపోయినట్లు చెప్పినారు అని మృతురాలి భర్త ఇచ్చిన రిపోర్ట్ మేరకు రేపల్లె పోలీస్ స్టేషన్ సీఐ ఎ మల్లిఖార్జునరా వు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వెంకట్ వకుళ ఫౌండేషన్ క్రికెట్ టోర్నమెంట్



నార్పల (జనం రిపోర్టర్) : మండల కేంద్రంలో వెంకట్ వకుళ ఫౌండేషన్ ఛాంపియన్ షిప్ కప్ 10వ తేదీన శనివారం ప్రారంభమవుతున్న సందర్భంగా వెంకట్ వకుళ ఫౌండేషన్ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ను ఫౌండేషన్ చైర్మన్ ఆలం వెంకట నరస నాయుడు బుధవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ టోర్నమెంట్లో గెలుపొందిన మొదటి జట్టుకి మొదటి రూ. 50,000, రన్నరప్పుగా నిలబడిన రెండో జట్టుకి రూ. 25000 నగదు బహుమతి ఉంటుందని తెలిపారు. శింగనమల నియోజకవర్గం లోని ఆరు మండలాలకు చెందిన క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, చంద్రబాబు, నడిమింటి రాము, బొగ్గ నాగార్జున, బొగ్గ నారాయణస్వామి, నడిమిదొడ్డి చంద్ర మోహన్ రెడ్డి, తలారి మహేష్, తలారి వంశీ , గణేష్, హరీష్, షామీర్ తదితరులు పాల్గొన్నారు.

## మానకొండూరుకు.వర్ధన్నపేట నియోజకవర్గం ఇంచార్జ్- నమిండ్ల శ్రీనివాస్



హసన్ పర్తి మండలం (జనం రిపోర్టర్) : వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మానకొండూర్ నియోజకవర్గం మానకొండూర్ అధ్యక్షులు నందగిరి రవీంద్ర చారి ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కరీంనగర్ జిల్లా పరిశీలకులు వర్ధన్నపేట నియోజకవర్గ ఇంచార్జ్ నమిండ్ల శ్రీనివాస్ మరియు టీపీసీసీ జనరల్ సెక్రటరీ పిన్నింటి రఘునాథ్ రెడ్డి,ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు,మహిళా అధ్యక్షులు.జిల్లా నాయకులు. గ్రామపార్టీ అధ్యక్షులు అన్ని విభాగల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలి....

### ప్రతి రోజు కనీసం 6 లారీల నుండి 8 లారీల ధాన్యం లోడ్ తరలించాలి....

### అకాల వర్షాలు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి.... -

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 07. యాసంగి పంట కొనుగోలు లో కొనుగోలు కేంద్రాలకు వచ్చే నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని



జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముత్తారం మండలంలోని ముత్తారం, మచ్చుపేట, పారుపల్లి, కాల్వ శ్రీరాంపూర్ మండలం లోని శ్రీరాంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్, పెద్దరాత్ పల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా నాణ్యమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా జరగాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. అకాల వర్షాలు వస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన ధాన్యం స్టాక్ వేచి ఉండకుండా ఎప్పటికప్పుడు కాంటా వేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజు కొనుగోలు కేంద్రాల నుంచి కనీసం 6 నుంచి 8 లారీల వరకు లోడ్ రైస్ మిల్లులకు తరలించాలని , ఎక్కడ హమాలీల, రవాణా వాహనాల కొరత రాకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. అకాల వర్షాలు నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల వద్ద వర్షం కురిస్తే టార్పాలిన్ కవర్లతో ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్త వహించాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని అన్నారు. ముత్తారం మండల హెడ్ క్వార్టర్ లో జరుగుతున్న వరంగల్ - మంచిర్యాల జాతీయ రహదారి సి.ఎన్.జి పనులను పరిశీలించిన కలెక్టర్ పెండింగ్ లో ఉన్న చెల్లింపులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ముత్తారం తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపిడిఓ సురేష్, కాల్వ శ్రీరాంపూర్ తహసిల్దార్ జగదీష్ రావు, డిప్యూటీ తహసిల్దార్ శంకర్, ఏ.డి.ఏ వ్యవసాయ శాఖ అధికారి అంజని, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 20వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి సిఐటియు

పెదకాకాని ( జనం రిపోర్టర్ ) : పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు ఉప్పలపాడు వెనిగండ్ల అగత్వరపాడు గ్రామపంచాయతీలలో ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె జరుగుతుందని దానిలో భాగంగా సమ్మెలో పాల్గొంటున్నా ము అని తెలియజేస్తూ గ్రామపంచాయతీ కార్యదర్శులకు సమ్మె నోటీసులు ఇవ్వటం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కార్మికులకు పంచాయతీ కార్మికులకు మనదేశంలో స్వాతంత్రం రాక పూర్వమే బ్రిటిష్ కాలము నుండి ప్రాణ త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం 1926 వర్క్ మెన్ కాంపెన్ నేషన యాక్ట్ 1923 వేతనాల చెల్లింపు చట్టం 1935 తోసహా కనీస వేతనాలు చట్టం 1948 బోనస్ గ్రాడ్యుటి పిఎఫ్ ఈఎస్ఐ వంటి 29 చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్స్ గా మార్చి వేసింది ఈ లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను హరిస్తాయి సంఘం పెట్టుకునే హక్కును సమ్మె హక్కును నిరు వీర్యం చేస్తున్నాయి ఉద్యోగ విధానంలో ఫిక్సడ్ ధర్మో ఎంప్లాయిమెంట్ విధానం ద్వారా ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులను బానిసలుగా మార్చివేస్తాయి వేతనాలు అడిగే హక్కులను కార్మికులు కోల్పోతారు ఎంతటి ప్రమాదకరమైన లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 20వ తేదీ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. మన రాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులకు గత ఎనిమిది సంవత్సరాలుగా జీతాలు పెరగలేదు మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న విధుల నే పంచాయతీ కార్మికులు కూడా నిర్వహిస్తున్నారు అయినా వారికి 14000 రూపాయలు మాత్రమే ఇస్తున్నారు రాష్ట్రమంతా ఒకే జీతం లేదు కనీస వేతనాలు గుర్తింపు కార్డులు పిఎఫ్ ఈఎస్ఐ దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం మొదలగు వాటికి సంబంధించి ఆరేళ్ళ క్రితం జీవో జారీ చేసిన జీవో నెంబర్ 132. 142. 680. జీవోలు నేటికీ అమలు కావడం లేదు గతం నుండి పనిచేసిన వారికి టెండర్లతో సంబంధం లేకుండా వీధుల్లో కొనసాగించాలని 2015 మరియు 2023 లో హైకోర్టు ఇచ్చిన తీర్పును బుట్ట దాఖలు చేస్తున్నారు అక్రమ తొలగింపులు వేధింపులు కొనసాగుతున్నాయి ఈ సమస్యల పరిష్కారం కోసం మే 20వ తేదీ దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో భాగంగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొంటారని అన్నారు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షించాలి మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధముగా పంచాయతీ కార్మికులకు 21000 జీతం చెల్లించాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటి యు నాయకులు జి రాజ రమేష్ ఉప్పలపాడు గ్రామపంచాయతీ నాయకులు పి దానేలు ఎం రమణ ఏ నాగమ్మ తక్కెళ్ళపాడు కెశేషగిరి షేక్ సుభాష్ చంద్రబోస్ అగతర్పడు టి అంజిరెడ్డి కే బాబు జె రత్నకుమారి డి మరిమ్మ జె కామేశ్వరరావు వెనిగండ్ల ఎస్ లక్ష్మి బి దుర్గా ఎస్ నారాయణమ్మ డి జ్యోతి అమృతరావ్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల ప్రాణాలు కాపాడడమే నా బాధ్యత ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్.....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 07. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో జరిగిన హెల్మెట్ పంపిణీ కార్యక్రమంలో రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.గోదావరిఖని ప్రధాన చవరస్తా లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడంలో భాగంగా, గోదావరిఖని ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాలో ప్రత్యేక హెల్మెట్ పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ ముఖ్య అతిథిగా హాజరై, పలువురు ద్విచక్ర వాహనదారులకు స్వయంగా హెల్మెట్లు అందించారు.ఈ సందర్భంగా రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ, "ప్రతి ఒక్కరి ప్రాణం అమూల్యం. రోడ్డు ప్రమాదాల నుండి మన ప్రాణాలను కాపాడుకోవడంలో హెల్మెట్ ముఖ్యపాత్ర పోషిస్తుంది. ప్రభుత్వంగా, పోలీస్ విభాగంగా ప్రజలకు అవగాహన కల్పించడం బాధ్యత మాత్రమే కాదు, మానవీయ విధి కూడా," అన్నారు. యువత హెల్మెట్ ధరించడం అవసరమనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా పంచడం జరుగుతుంది.అలాగే, ట్రాఫిక్ డిపార్టుమెంట్ అధికారి జ్యోతి మాట్లాడుతూ, "ప్రతి రోజు జరిగే రోడ్డు ప్రమాదాలలో చాలా వరకు హెల్మెట్ లేకపోవడం వల్లే తీవ్ర దుస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే పోలీస్ శాఖ ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది," అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్బిఐ రీజినల్ మేనేజర్, డిసిపి అడ్మిన్ రాజు, ఏసిపి మడత



రమేష్, ట్రాఫిక్ ఏసిపి జానీ నరసిమ్ములు, ట్రాఫిక్ సిఐ రాజేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ హరి శేఖర్, సంతోష్ కుమార్ , రామరాజు , సంబంధిత సిబ్బంది అధికారులు, నగర పోలీస్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, స్థానిక కార్పొరేటర్లు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, మోటార్ బైక్ యూనియన్ సభ్యులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. వాహనదారుల్లో జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించేందుకు, ఈ కార్యక్రమం ఉపయుక్తంగా నిలుస్తుందని ప్రతి ఒక్కరూ అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ తమ బిజీ షెడ్యూల్ మధ్యలో ఈ కార్యక్రమానికి హాజరై, ప్రజలపై తన పట్ల ఉన్న ప్రేమను, రోడ్డుపై భద్రత పట్ల ఉన్న నిబద్ధతను ప్రదర్శించారు. కార్యక్రమం ట్రాఫిక్ పోలీసులు, పాల్గొన్న ముఖ్యులు, ప్రజలు హెల్మెట్ ఉపయోగాన్ని ప్రతిరోజూ తప్పనిసరిగా అనుసరించాలని ప్రతిజ్ఞ చేశారు.

## పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలే ఉన్నాయి ఇళ్ల స్థలాలు ఎక్కడ

### ప్రముఖ దిన పత్రికలో వచ్చిన వార్తను ఖండిస్తూ ఏలేశ్వరం టిడిపి కౌన్సిలర్లు



ఏలేశ్వరం, ( జనం రిపోర్టర్ ) : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం.ప్రముఖ దిన పత్రికలో వచ్చిన వార్తను ఖండిస్తూ ఏలేశ్వరం లో టిడిపి కౌన్సిలర్ సభ్యులు, టిడిపి శ్రేణులతో కలిసి ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో 6, 18 వ వార్డు కౌన్సిలర్లు కోణాల వెంకట రమణ, ఎండగుడి నాగబాబు, మాట్లాడుతూ అవాస్తవాలు ప్రచురించే ముందర నిజ నిజాలు తెలుసుకుని వార్తలు ప్రచురించాలని వారు మండిపడ్డారు. ఇళ్ల నిర్మాణాల పేరుతో లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నామనేది అసత్యమని దీనిపై ఏ దేవునిపై ప్రమాణం చేయమన్న చేసేందుకు వెనకాడబోమని వారన్నారు. అలాగే గత ఐదు సంవత్సరాల ప్రభుత్వ కాలంలో మీరు చేసిన అవినీతిపై ప్రతి ఒక్కటి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని అన్నారు. ఇప్పటికీ ఎవరి కీ ఉపయోగపడని స్థలాలను అధిక ధరలకు కొని వాటిని జగనన్న ఇళ్ల స్థలాలకు ఇచ్చారని కానీ పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలే ఉన్నాయి గాని వాటికి సంబంధించిన ఇళ్ల స్థలాలు ఎక్కడ ఉన్నాయో ఇప్పటికీ తెలియడం లేదని అన్నారు. మెప్మా లో జరిగిన అవినీతి మాకు తెలియనిదా అని వారు ఆరోపించారు. తెలుగుదేశం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి చౌకబారు వార్తా కథనాలను ప్రచురించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. అవినీతికి పాల్పడిన మీరే సొంత పత్రికలలో విమర్శలకు డబ్బాలు కొట్టుకోవడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోణాల వెంకటరమణ, రాయుడు చిన్న కర్రోత్ గాంధీ కిలారి రామచంద్ర, శశి స్వామి, బత్తుల రాజబాబు, సిడగం బాలు, గెద్ద అప్పన్న, గంగరాజు, ఎర్ర బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు..

## మారు పేర్ల, విజిలెన్స్ పెండింగ్ కేసుల పై మే 16న. చలో ఇందిరా పార్క్ మహా ధర్నా...

### మే 16న చలో ఇందిరా పార్క్ మహా ధర్నాకు సిద్ధమైన సింగరేణి కార్మికుల పిల్లలు.....




రామగుండం ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 07. సింగరేణిలో ప్రధానమైన సమస్య, మారు పేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్య. అనేక సంవత్సరాల నుండి మారు పేర్లు పరిష్కారం కొరకై ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చిన, చేతులు దులుపుకుంటూ ఇప్పుడు అప్పుడు అని కాలయాపన మాత్రమే చేస్తున్నారు. ఈ కాలపరిమితి వలన ఇప్పటికే రెండు ప్రాణాలు పోయాయి. ఇంకెన్ని హత్యలు చేద్దామని సిద్ధమవుతుంది సింగరేణి యాజమాన్యం...?లక్క శ్రవణ్ గౌడ్, వంగ సంతోష్ మాట్లాడుతూ... మే 16న. సింగరేణి అన్ని కోల్బెల్ట్ ఏరియా మారుపేర్ల బాధితులు అందరూ ఏకమై మారు పేరుల సమస్య పరిష్కారం కొరకై సింగరేణి యాజమాన్యం ఇబ్బంది పెడుతున్నటువంటి విషయాన్ని, తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి కి వినిపించే విధంగా హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద నిరసన తెలుపుటకు మహా ధర్నా ఉండబోతుంది. దయచేసి సింగరేణి 11 కోల్ బెల్ట్ ఏరియా మారుపేర్ల బాధితులు అందరు కూడా ఇకనైనా బయటికి వచ్చి మన యొక్క సమస్యను రాష్ట్రానికి వినిపించే విధంగా తెలియజేసుకునే సమయం వచ్చింది. మీరంతా ఏకమై వచ్చి మాకు బలాన్ని చూపుతారని కోరుతున్నామని,అలాగే సింగరేణి అన్ని కార్మిక సంఘాలు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాలు, ప్రస్తుతం సింగరేణి కార్మికులు కూడా మాకు మద్దతు తెలిపి, హైదరాబాద్ ఇంద్ర చౌక్ వద్ద చేస్తున్నటువంటి మహాధర్నను జయప్రదం చేస్తారని కోరుతున్నామని, ఇటీ ప్రెస్ మీట్ లో లక్క శ్రావణ్ గౌడ్, తిరుమల శ్రీనివాస్, వంగ సంతోష్, పార్థపల్లి హరీష్, ఈర్ల రాజయ్య, డిష్ బాబు, బొద్దుల రంజిత్, ఓం ప్రకాష్, రామిండ్ల సందీప్, గుర్రం సుధాకర్, కొమరమ్మ, జిల్లాల శ్రావణ్, మోతుకూరి రవికుమార్, ఆవుల రవి, రాజకుమార్, దరుగుల సతీష తదితరులు వారి యొక్క బాధను తెలియజేసుకున్నారు.

# ఆదర్శప్రాయంగా కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏటేటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న కళాశాల విద్యార్థులు











**హసీనా 872, శ్రీకాంత్ 452 మార్కులతో ప్రభంజనం**

**ఇంగ్లీష్ తెలుగు మీడియంల లో ప్రవేశాలకు ఆహ్వానం**

**ప్రిన్సిపల్ నరేంద్ర కుమార్**

అమరచింత /కొత్తకోట/ వనపర్తి జిల్లా ప్రతినిధి ( జనం రిపోర్టర్ ) : వనపర్తి జిల్లాలోని కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. కొత్తకోటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల 1970లో స్థాపించబడింది కో- ఎడ్యుకేషన్ గా కొనసాగుతున్న ఈ కళాశాల ఏటేటా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ప్రభంజనం సృష్టిస్తోంది. 2024 - 25 వార్షిక పరీక్షల్లో హసీనా 872, శ్రీకాంత్ 452 అక్షయ 423 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం ప్రిన్సిపల్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు వివిధ రంగాలలో స్థిరపడ్డారని తెలిపారు. తమ కళాశాలలో విశాలమైన తరగతి గదులు, పచ్చని చెట్లతో కూడిన ప్రాంగణం, అపార అనుభవం కలిగిన అధ్యాపకులు, స్వచ్ఛమైన తాగునీరు, ఉచిత పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామన్నారు. క్రీడల పై ఆసక్తి ఉన్న విద్యార్థులకు విశాలమైన క్రీడా ప్రాంగణం ఉందన్నారు. ఆధునిక ప్రయోగశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. 2025 26 అకాడమిక్ ఇయర్ కు ఎంపీసీ ఇంగ్లీష్/ తెలుగు మీడియంలో అలాగే బైపిసి ఇంగ్లీష్/ తెలుగు మీడియం సిఇసి ఇంగ్లీష్ /తెలుగు మీడియం లో ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతున్నామని ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి ప్రవేశాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ సూచించారు.

# పార్టీ లైన్ దాటితే ఎవరిపైనైనా చర్యలు సహజం

**- ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నకు ఛాన్స్**

**- పురమల్లకు ఎమ్మెల్యే టిక్కెట్**

**- పిసిసి అధ్యక్షుడిగా వి.హెచ్., డి.శ్రీనివాస్, కె.కేశవరావుకు అవకాశమిచ్చిన కాంగ్రెస్-చర్యలు తీసుకున్నది క్రమశిక్షణ కమిటీ..?- మంత్రి పొన్నం... పిసిసి అధ్యక్షుడు మహేష్ కు ఏమి సంబంధం..?-**

**రాష్ట్ర హౌజెఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి**



చిగురుమామిడి (జనం రిపోర్టర్):ఎంత సీనియర్ లీడర్ అయినా, మాజీ మంత్రి అయినా... పార్టీ లైన్ దాటితే కాంగ్రెస్ పార్టీలో క్రమ శిక్షణ చర్యలు తీసుకోవడం సహజమేనని రాష్ట్ర హౌస్ ఫెడ్ మాజీ చైర్మన్,బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు.నేతల మధ్య సమన్వయ లోపం ఉండకుండా ఏ స్థాయి లీడర్ అయినా కార్యకర్తలందరినీ కలుపుకుని వెళ్లడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం అన్నారు. తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్), వి.హన్మంతరావు, పురమల్ల శ్రీనివాస్ లు మున్నూరు కాపు కులానికి చెందినవారు. తీన్మార్ మల్లన్న, పురమల్ల శ్రీనివాస్ లను పార్టీ సస్పెండ్ చేయడంతో మున్నూరు కాపుకు చెందిన కొందరు నాయకులు సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. టిపిసిసి అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్, రవాణా, బీ.సీ. సంక్షేమ శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ గౌడ్ లు ఉండటంతో వీరు ఇద్దరూ గౌడ కులానికి చెందడంతో గౌడ కులస్తులు మున్నూరు కాపు కులానికి చెందిన నేతలనే టార్గెట్ చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం తగదని హెచ్చరించారు. దేశానికే తెలంగాణ రోల్ మోడల్ ఉండే విధంగా కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ చెప్పినట్టు ఎవరు ఎంతో.. వారికి అంత అన్న విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కులగణన చేపట్టిందన్నారు. కులగణన లెక్కలన్ని తప్పుల తడకగా ఉందంటూ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ తీన్మార్ మల్లన్న తన న్యూస్ ఛానెల్లో కులగణన పత్రాలను కాల్చివేసి పార్టీ లైన్ దాటినపుడు చర్యలు తీసుకోకుండా ఏమి చేస్తారంటూ ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి తీన్మార్ మల్లన్న అత్యంత సన్నిహితుడు అయినప్పటికి పార్టీ లైన్ దాటితే ఎంత పెద్ద నాయకుడినైనా సస్పెండ్ చేయడమే అన్నారు. పురుమల్ల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరిన కొద్ది రోజులకే కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జీగా నియమి ంచిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. మంత్రి పొన్నం కృషి లేకుండానే పురుమల శ్రీనివాస్ కు ఎమ్మెల్యే టిక్కెట్ వచ్చిందా చెప్పాలని డిమాండ్ చేసారు. మంత్రి పొన్నం సీనియర్ నాయకుడని బహిరంగంగా అప్రతిష్ట పాలు చేస్తే పార్టీ అధిష్టానం చూస్తు ఉరుకుంటుందా అంటూ ప్రశ్నించారు. పురుమల్ల శ్రీనివాస్ పార్టీ లైన్ పలుమార్లు దాటితే హెచ్చరించిన తన తీరు మార్చుకోకపోవడం వల్లనే పార్టీ సస్పెండ్ చేసిందన్నారు. వేములవాడ ఎమ్మెల్యే టిక్కెట్ ఆది శ్రీనివాస్ కు ఇవ్వడంతో గెలుపొందిన తనకి ప్రభుత్వ విప్ ఇచ్చిందన్నారు. మంత్రి పదవి రాకుండా ఏవరూ కూడా అడ్డుకోవడం లేదని కేవలం కుల రాజకీయాలు చేయడానికే అసత్య ఆరోపణ చేస్తున్నారని అవి మానుకోవాలని హితవు పలికారు. వి.హన్మంతరావు, డి.శ్రీనివాస్, కె.కేశవరావు లను కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షులను చేసి గౌరవించిందన్నారు. తప్పులు చేసింది వారైతే టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ల పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఈ నీచ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

## ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుపేదలకు మొండిచేయి..

### కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను నమ్మించి గొంతు కోసింది... అర్హులకు అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు... త్వరలోనే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తాం.. విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి వెల్లడి...

చిగురుమామిడి ( జనం రిపోర్టర్ ) : :కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంపికలో అర్హులైన నిరుపేదలను కాదని, కోట్లాది రూపాయల విలువచేసే భూములు ఉన్న వాళ్లకు ఇండ్లు మంజూరు చేస్తున్నారని,అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్యలు హెచ్చరించారు.బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో కొత్త శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు 420హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పేదలైన అర్హులను అనుగదొక్కి కాంగ్రెస్ పార్టీ బడా నాయకులనే ఇండ్ల ఎంపికలో లబ్ధిదారులుగా ఎంపిక చేశారని కొత్త శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుపేదలకు ఇండ్ల మంజూరులో మొండిచేయి చూపిందన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం ఇల్లు లేని వారికి,కిరాయి గృహాల్లో ఉన్న వారికి కాకుండా ఇందిరమ్మ కమిటీల పేరుతో మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల బంధువులకు,అర్హత లేని వాళ్లకు ఇల్లు మంజూరు చేస్తున్నారని,దీంతో అర్హులైన వారికి అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు.ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకి మండలంలో కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూళ్లు చేస్తున్నారని సోషల్ మీడియా గ్రూపులలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే పోస్టులు పెడుతున్నారన్నారు.రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తక్షణమే స్పందించి మండలంలో అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా,కాంగ్రెస్ పార్టీ నాయకుల జోక్యం లేకుండా చూడాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అధికారులను బలి పశువులను చేయకుండా పూర్తి పారదర్శకతను పాటించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.మొదటి విడతలో ఎంపికైన గునుకుల పల్లె గ్రామపంచాయతీలో ఏఈ సమక్షంలో ముగ్గులు పోసిన ఇంటికి బిల్లు రాకుండా అడ్డుకుంటున్నారని,400 చదరపు అడుగుల నుండి 600వరకు ఉండాలనే నిబంధనను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు.నిజమైన అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయకపోతే ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి రమణారెడ్డి,మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు పెనుకుల తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి పేసరి రాజేశం,తదితరులు పాల్గొన్నారు.

## త్రాగు నీటికి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు.....

### త్రాగునీటి సరఫరా పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష....



రామగుండం(జనం రిపోర్టర్) : రామగుండం:మే 07. జిల్లాలో ఎక్కడా త్రాగు నీటికి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష వేసవి కాలంలో త్రాగు నీటి సరఫరా పై అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మిషన్ భగీరథ సోర్స్ గా త్రాగు నీటి సరఫరా చేయాలని, అనవసరంగా బోర్లు వేయవద్దని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇతర నీటి వనరుల పై ఆధారపడాలని అన్నారు. త్రాగు నీటి కోసం పంచాయతీ వద్ద అందుబాటులో ఉన్న నిధుల అత్యవసరంగా వాడుకోవాలని



అన్నారు.వేసవి కాలంలో ఎక్కడ త్రాగు నీటి సరఫరా కొరత రాకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ త్రాగు నీటి ఇబ్బందులు వచ్చినా ఎంపీడీవోలు వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరా తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ఈఈ మిషన్ భగీరథ గ్రీడ్ పూర్ణ చందర్ రావు, ఇంట్రా ఈఈ గంగాధర శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## : పెద్దంపేట్ గ్రామంలో

## నూతన లక్ష్మీ పెట్రోల్ బంక్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్...



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : పెద్దంపేట్ గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించబడిన లక్ష్మీ పెట్రోల్ బంక్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామస్థుల ఉత్సాహభరిత హాజరుతో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, “పెద్దంపేట్ వంటి గ్రామ ప్రాంతాల్లో సౌకర్యవంతమైన ఇంధన వనరులు అందుబాటులోకి రావడం ఎంతో గర్వకారణం. రైతులు, యువత, మహిళలు, వ్యాపారవేత్తలు వంటి అన్ని వర్గాల ప్రజలకు ఈ పెట్రోల్ బంక్ ఎంతో ఉపయోగపడుతుంది. ఇది కేవలం ఇంధన పంపిణీ కేంద్రం కాదు, గ్రామ అభివృద్ధికి తొలిపడుగులు వేసే కేంద్రమవుతుంది” అని తెలిపారు. ఈ సందర్భంగా పెద్దంపేట్ గ్రామస్థులు ఎమ్మెల్యే కి ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో ఇటువంటి ప్రాజెక్టులు మరిన్ని తీసుకురావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో పలు అభివృద్ధి పనులను కూడా పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ప్రముఖులు మాట్లాడుతూ, “ఇది గ్రామాభివృద్ధికి ఒక మైలురాయి. ఇంధన సౌకర్యంతో పాటు స్థానికులకు ఉద్యోగావకాశాలు కూడా కలుగనున్నాయి” అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ సంబంధిత నాయకులు, ప్రజలు తదితరులు ఉన్నారు.



## జగద్గురు శ్రీ మాధ్విరాజ్

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి 332వ. ఆరాధన ఉత్సవాల్లో

## పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 07. రామగుండం నియోజకవర్గంలోని గోదావరిఖని పట్టణంలో ఘనంగా జరుగుతున్న జగద్గురు శ్రీ మాధ్విరాజ్ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి గురు పూజ 332వ. ఆరాధన, 3వ భజన సప్తాహ మహోత్సవాలు శ్రద్ధాభక్తులతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మనాలి ఠాకూర్ ని ఆలయ అర్చకులు, నిర్వాహకులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి జరిగిన విశిష్ట ఆరాధన కార్యక్రమంలో వారు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, “సనాతన ధర్మాన్ని పరిరక్షించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు ప్రజలందరినీ ఒకే తాటిపైకి తెచ్చే శక్తిని కలిగి ఉన్నాయి. భక్తి భావనతో జరిపే ఈ సప్తాహిక కార్యక్రమాలు యువతలో ధర్మంపై ఆసక్తిని పెంచుతాయి,” అని పేర్కొన్నారు. ప్రజలతో సమావేశమై మానవ సేవకు తమ కుటుంబం ఎల్లప్పుడూ ముందుంటుందని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమానికి అనేక ప్రాంతాల నుంచి భక్తులు హాజరై, ఘనవిగా నిర్వహించిన ఈ ఉత్సవాన్ని సఫలమయ్యేలా చేశారు.



## హసన్ పర్తి ఎస్ఐ కుమారుడిని అభినంచిన సీపీ



హసన్ పర్తి మండలం ( జనం రిపోర్టర్ ) : హసన్ పర్తి:హసన్ పర్తి సబ్ ఇన్స్పెక్టర్ దేవేందర్ కుమారుడు మాస్టర్ అక్షిత్ ను వరంగల్ పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు. రవీంద్ర నాథ్ ఠాగూర్ రాసిన ‘వేర్ ది మైండ్ ఈజ్ విత్ అవుట్ ఫియర్’అనే రచనను మూడు నిమిషాల పది సెకండ్లలో ఏడు బాషలల్లో అనర్గళంగా చెప్పి మాస్టర్ అక్షిత్ ‘ఇండియా బుక్ అఫ్ రికార్డు’లో స్థానం సాధించారు. దీంతో ఇండియా బుక్ అఫ్ రికార్డ్స్ జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని బుధవారం వరంగల్ పోలీస్ కమీషనరేట్ లో మాస్టర్ అక్షిత్ కు సీపీ సన్ ప్రీత్ సింగ్ అందజేసి అభినందించారు.

## బట్టలు ఉతకడానికి వెళ్లి ముగ్గురు మృతి



( జనం రిపోర్టర్ ) : ఎల్లనూరు మండలంలోని కల్లూరు గ్రామ సమీపంలో వున్న పులివెందుల బ్రాంచ్ కెనాల్ లో బుధవారం బట్టలు ఉతకడానికి వెళ్లి ముగ్గురు మృతి చెందారు. మృతులు కల్లూరు గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ



(65) లిడియా (9) జాషువా డానియల్ (7)మృతురాలు నాగలక్ష్మమ్మ బట్టలు ఉతుకుతుండగా మనవడు, మనవరాలు నీటిలో ఆడుకుంటుండగా మునిగిపోయారు. నీటిలో మునిగిపోయిన మనుమడు , మనవరాలిని కాపాడడానికి వెళ్లిన నాయనమ్మ నాగలక్ష్మమ్మ కూడా మృతి చెందటం గమనార్హం. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారవటం వలన గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## “ఆపరేషన్ సిందూర్ జయహో భారత్

ఉగ్రవాదం అంతం.. ( జనం రిపోర్టర్ ) : ఆపరేషన్ సింధూరపై బాపట్ల జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షురాలు. పట్టణ వైసీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారుఉగ్రవాదాన్ని అంతం చేయడమే భారత దేశ ప్రజలు ఆకాంక్ష అని తెలియజేశారు పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరిట చేసిన దాడులను స్వాగతిస్తునామనారు. ఈ సందర్భంగా వారు ఆపరేషన్ సిందూర్ విజయంతో భారతదేశ సైనికుల సత్తా ప్రపంచానికి మరోసారి తెలిసిందని అన్నారు. టెర్రరిస్టు స్థావరాలపై మన దేశ సైనికులు చేసిన దాడి దృశ్యాలను ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారని తెలిపారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం కోసం మోడీ అనుసరిస్తున్న విధానాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్ దాడులతో ఉగ్రవాదులకు భారత్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసిందని అన్నారు. ఉగ్రవాదం ఏ స్థాయిలో ఉన్న అణచివేసేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని తెలిపారు. పహల్గాం కిరాతక దాడి దేశ ప్రజలను కలచివేసిందని, కిరాతక ఉగ్రవాదులను అణచివేసే దిశగా ప్రభుత్వం దాడులు నిర్వహించటం అభినందనీయమన్నారు. అమాయకులపై దాడి చేసిన ఉగ్రవాదులను, అంతమొందించేలా భారత్ చేసిన దాడులకు ప్రపంచ దేశాలన్నీ మద్దతు తెలపటం, దేశానికే గర్వకారణం అన్నారు. సాధారణ పౌరులకు హాని కలిగించకుండా దాడులు చేసి ముష్కరులకు సరైన సమాధానం ఇచ్చిందని తెలిపారు. ఉగ్రవాదుల స్థావరాలపై ప్రజలకు హాని కలగకుండా ఖచ్చితమైన ప్రాంతాల్లో దాడులు చేయడం మన దేశ టెక్నాలజీ, శక్తి సామర్థ్యాలు ప్రపంచ దేశాలకు తెలిశాయని అన్నారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించి దేశంలో అంతర్గత కలహాలు సృష్టించాలని ప్రయత్నించిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను భారత ప్రజలు కుల మతాలకతీతంగా సమైక్యంగా ఆపరేషన్ సింధూరతో తిప్పి కొట్టారని తెలిపారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా వైఎస్ఆర్సిపి మైనారిటీ సెల్ అధ్యక్షురాలు నసీరున్నీసా బేగ్ బాపట్ల జిల్లా వైఎస్ఆర్ సీపీ అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి. బాపట్ల జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిమట బాలాజీ పట్టణ వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ కరేటి శేషగిరిరావు వైసీపీ నాయకులు నీలా నాంచారయ్య షేక్ అబ్దుల్ కదూస్ వైసీపీ నాయకులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్య బృందానికి అభినందనలు....

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష....



రామగుండం: ( జనం రిపోర్టర్ ) : రామగుండం:మే 07. క్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా జిల్లా ఆసుపత్రిలో నిర్వహించినందుకు గాను వైద్య బృందాన్ని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందిస్తూ, బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుల్తానాబాద్ కు చెందిన నిట్టూరి మానస అనే మహిళకు గతంలో రెండు సీజేరియన్ ఆపరేషన్ లు జరిగాయని, గర్భ సంచి లో పెద్ద గడ్డలతో మహిళ తీవ్రమైనా కడుపు నొప్పి తో బాధ పడుతూ, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిందని, మహిళకు అవసరమైన పరీక్షలు చేసి, మే 7న. గైనకాలజిస్ట్ డా.స్రవంతి,జనరల్ సర్జన్ , డా.సాయి ప్రసాద్, లాప్రోస్కోప్ సర్జన్ డా. అమర సింహ రెడ్డి, సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్,డా. రామం,డా. స్వాతి, డా. సౌరయ్య కలిసి ఆ మహిళకు లాప్రోస్కోప్ హిస్టక్టమ్ సర్జరీ విజయవంతంగా చేశారని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ రకాల స్పెషలిస్ట్ సేవలు, శస్త్ర చికిత్సలు విజయవంతంగా జరుగుతున్నాయని, అవసరమైన ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## కొత్త రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ



శింగనమల ( జనం రిపోర్టర్ ) : మండల పరిధిలోని గ్రామ సచివాలయ కేంద్రాలలో కొత్త రేషన్ కార్డులకు 07.05.2025 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని శింగనమల మండల తహసిల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ పౌర సరఫరాల శాఖ కమిషనర్ విజయవాడ మరియు అనంతపురం జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కొత్త రేషన్ కార్డు పొందాలన్నా, రేషన్ కార్డులో పేరు మార్చుకోవాలన్న, హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని పేర్కొన్నారు. రేషన్ కార్డులో కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లు ఎక్కించాలన్న,రేషన్ కార్డు వద్దనుకుంటే తొలగించాలన్నకుటుంబ విభజనలో భాగంగా కొత్త రేషన్ కార్డును మంజూరు చేయాలన్న, రేషన్ కార్డులో చిరునామాను మార్చాలన్న, కార్డులో తప్పులున్న తదితర మార్పులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలకు రేషన్ కార్డు లేకపోతే కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోవడానికి వీలుంటుందని తెలిపారు. సంబంధిత డాక్యుమెంట్ అని తప్పనిసరిగా తీసుకెళ్లాలని, మండల ప్రజలు ప్రతి ఒక్కరు సార్ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహసిల్దార్ కోరారు.

## సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి..

## హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వా లక్ష్మారెడ్డి పిలుపు..




చిగురుమామిడి(జనం రిపోర్టర్) : :సామాజిక బాధ్యతగా డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్రలో భాగంగా బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో రెండవ రోజు ముదిమాణిక్యం, రామంచ,చిన్న ముల్కనూర్, కొండాపూర్ గ్రామాలలో జేఏసీ,ఐకెపి మహిళా సంఘాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారుల చైతన్య పాటల అనంతరం జేఏసీ బాధ్యులు ఈ గ్రామాలలో డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. సమాజంలో ఉన్న ప్రతి వర్గం పార్టీలకతీతంగా ఏకమై డ్రగ్స్ నీ నిర్మూలించినప్పుడే యువతను కాపాడుకున్న వాళ్ళం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, నియోజకవర్గం కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య, తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేప్యాల ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పూదరి వేణుగోపాల్ గౌడ్,మాజీ ఉపసర్పంచ్ సాంబారి బాబు,పెసరి రాజేశం, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పూదరి వెంకటేష్,చేపూరి సుధాకర్ పటేల్,లోడీ సంస్థ ప్రతినిధులు ఉప్పుల కుమారస్వామి,గాండ్ల పద్మ,జేఏసీ బాధ్యులు డాక్టర్ ఎదులపురం తిరుపతి, వేముల జగదీష్, తాళ్లపల్లి జగన్ ,తాళ్లపల్లి ప్రభాకర్, ఎర్ర కార్తీక్, సీసీ గంప సంపత్, జగన్ గౌడ్, రమేష్, లక్ష్మారెడ్డి, అచ్చ రవి, గాజుల శ్రీలక్ష్మి,అమృత వర్షిని పంచాయతీ కార్యదర్శి, వేమునూరి సత్తయ్య,బుర్ర ప్రేమలత, తవటం సుజాత తదితరులు పాల్గొన్నారు.

## “ఆపరేషన్ సిందూర్ జయహో భారత్

## ఉగ్రవాదం అంతం.. భారత్ పంతం.



రేపల్లె (జనం రిపోర్టర్) : ఆపరేషన్ సింధూరపై బాపట్ల జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షురాలు. పట్టణ వైసీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారుఉగ్రవాదాన్ని అంతం చేయడమే భారత దేశ ప్రజలు ఆకాంక్ష అని తెలియజేశారు పాక్ ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరిట చేసిన దాడులను స్వాగతిస్తునామనారు. ఈ సందర్భంగా వారు ఆపరేషన్ సిందూర్ విజయంతో భారతదేశ సైనికుల సత్తా ప్రపంచానికి మరోసారి తెలిసిందని అన్నారు. టెర్రరిస్టు స్థావరాలపై మన దేశ సైనికులు చేసిన దాడి దృశ్యాలను ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారని తెలిపారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వం కోసం మోడీ అనుసరిస్తున్న విధానాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సింధూర్ దాడులతో ఉగ్రవాదులకు భారత్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసిందని అన్నారు. ఉగ్రవాదం ఏ స్థాయిలో ఉన్న అణచివేసేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని తెలిపారు. పహల్గాం కిరాతక దాడి దేశ ప్రజలను కలచివేసిందని, కిరాతక ఉగ్రవాదులను అణచివేసే దిశగా ప్రభుత్వం దాడులు నిర్వహించటం అభినందనీయమన్నారు. అమాయకులపై దాడి చేసిన ఉగ్రవాదులను, అంతమొందించేలా భారత్ చేసిన దాడులకు ప్రపంచ దేశాలన్నీ మద్దతు తెలపటం, దేశానికే గర్వకారణం అన్నారు. సాధారణ పౌరులకు హాని కలిగించకుండా దాడులు చేసి ముష్కరులకు సరైన సమాధానం ఇచ్చిందని తెలిపారు. ఉగ్రవాదుల స్థావరాలపై ప్రజలకు హాని కలగకుండా ఖచ్చితమైన ప్రాంతాల్లో దాడులు చేయడం మన దేశ టెక్నాలజీ, శక్తి సామర్థ్యాలు ప్రపంచ దేశాలకు తెలిశాయని అన్నారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించి దేశంలో అంతర్గత కలహాలు సృష్టించాలని ప్రయత్నించిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను భారత ప్రజలు కుల మతాలకతీతంగా సమైక్యంగా ఆపరేషన్ సింధూరతో తిప్పి కొట్టారని తెలిపారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా వైఎస్ఆర్సిపి మైనారిటీ సెల్ అధ్యక్షురాలు నసీరున్నీసా బేగ్ బాపట్ల జిల్లా వైఎస్ఆర్ సీపీ అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి. బాపట్ల జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిమట బాలాజీ పట్టణ వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ కరేటి శేషగిరిరావు వైసీపీ నాయకులు నీలా నాంచారయ్య షేక్ అబ్దుల్ కదూస్ వైసీపీ నాయకులు పాల్గొన్నా

## ఈఓఆర్డీని ఘనంగా సన్మానించిన సర్పంచ్



శింగనమల :(జనం రిపోర్టర్) : శింగనమల మండల ఈఓఆర్డీ వెంకటలక్ష్మిని ఆకులేడు సర్పంచు సుభాషిణి, రామాంజనేయులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ మండలంలో ఈఓఆర్డిగా విధులు నిర్వహిస్తున్న వెంకటలక్ష్మి సత్యసాయి జిల్లా సోమిందేపల్లి ఎంపీడీవో గా ప్రమోషన్ పై వెళుతున్న శుభ సందర్భంగా ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలో ఈ ఓ ఆర్ డి ఎంతో నీతి నిజాయితీగా విధులను నిర్వర్తించి పంచాయతీలలో పలు సమస్యల పరిష్కారం చూపడంలో ఎంతో కృషి చేసిందని కొనియాడారు. సోమందేపల్లి మండలంలో కూడా ఎంపీడీఓ గా మంచి పేరు తెచ్చుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, పంచాయితీ సెక్రటరీలు నరసింహారెడ్డి, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డిటిని రక్షించుకుందాం



(జనం రిపోర్టర్) : ఈరోజు అనంతపురంలో జేఏసీ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించు ఆర్ డి టి ని రక్షించుకుందాం ఎఫ్ సి ఆర్ ఏ ని రెన్యువల్ చేయాలని నిరాహార దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులకు సంఘీభావంగా మద్దతు తెలిపిన జడ్పీ వైస్ చైర్ పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ జిల్లాలో పేద ప్రజలకు ఆర్డిటి సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించింది పేద ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించడంలో ఆర్డిటి పాత్ర ఎంతో ఉంది అని కొనియాడారు

## వైద్యాధికారులకు మరియు ఫార్మసీ ఆఫీసర్లకు

## జిల్లా అధికారుల కార్యాలయం లో సమీక్షా సమావేశం....



రామగుండం:(జనం రిపోర్టర్) : రామగుండం:మే 07.బుధవారం వైద్యాధికారులకు, ఫార్మసీ ఆఫీసర్లకు జిల్లా అధికారుల కార్యాలయ సముదాయము, పెద్దపల్లి లోని మిని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ జి. అన్నా ప్రసన్న కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇ – ఔషధీ వెబ్సైట్ లో ఇండెంట్, స్టాక్ ఎంట్రీ , ఖర్చు వివరాలు ఫార్మసీ ఆఫీసరు లు నమోదు చేయాలి అని అన్నారు. వైద్య అధికారులు వడ దెబ్బ జాగ్రత్తల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఓ.ఆర్. ఎస్. డిపో ల ను ఏర్పాటు చేయాలి అని అన్నారు. ప్రతి మరణం ను దానికి గల కారణాలను నమోదు చేయాలి అని, రాబోయే కాలంలో కీటక జనిత వ్యాధులు, సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలను తీసుకోవాలని, హై రిస్క్ ఏరియా లలో ప్రత్యేక దృష్టి పెట్టాలి అని అన్నారు. అధిక శరీర ఉష్ణోగ్రత మరియు ఏదైనా అపస్మారక, గందరగోళం లేదా చెమటలు పట్టక పోవడం, ఎవరి లోనైన కనిపిస్తే 108 కి కాల్ చేయాలి అని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఎన్. సి. డి. స్పెషల్ డ్రైవ్ ను ఈ నెల ఆఖరు వరకు పూర్తి చేయాలని, ప్రైవేట్ ఆసుపత్రి లలో ప్రసవాలను తగ్గించాలి,అందుకు గల కారణాలను పరిశీలించాలి, పరిష్కరించి , ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 3 నెలల లోపు గర్భవతులకు గర్భం వద్దు అనుకునే వారికి, వివాహితులకు, అవివాహితులకు ఉచితంగా అబార్షన్ కేర్ సేవ కలదు, అవసరమైన వారు వినియోగించు కోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాజ మౌళి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్, డాక్టర్ శ్రీ రాములు, డాక్టర్ కె. వి.సుధాకర్ రెడ్డి, డాక్టర్ బి.కిరణ్ కుమార్, వైద్య అధికారులు మరియు ఫార్మసీ అధికారులు పాల్గొన్నారు.



# శ్రీ సాయిబాబా వార్షికోత్సవం సందర్భంగా అన్న సంతర్పణ.





పొన్నూరు మే 7 .జనం రిపోర్టర్: గుంటూరు జిల్లా కొండమూది గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సాయిబాబా 32వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం దేవస్థానం లో ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్న సంతర్పణ జరిగింది. ఈనెల 5 ,6 ,7 తేదీలలో వార్షికోత్సవ సందర్భంగా శ్రీ సాయిబాబాకు భక్తులు ప్రత్యేక పూజలు ,నైవేద్యాలను సమర్పించి పూజలు అందించారు. ఆఖరి రోజు 7వ తారీఖు బుధవారం అన్నసంతర్పణ నిర్వహించి భక్తులకు కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

# శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు



(జనం రిపోర్టర్) : కొత్తవలస క్షత్రియ సేవా పరిషత్ ఆధ్వర్యంలో విప్లవ జ్యోతి శ్రీ అల్లూరి సీతారామరాజు 100 వర్ధంతి.. స్వాతంత్ర్యానికి స్ఫూర్తినిచ్చింది అల్లూరి ఉద్యమమే .. తహసిల్దార్ నీలకంఠరావు భారతదేశ స్వాతంత్ర సంగ్రామానికి ఉద్యమ స్ఫూర్తిని ఇచ్చింది అల్లూరి సీతారామరాజు అని కొత్తవలస మండల తహసీల్దార్ నీలకంఠరావు తెలిపారు. అల్లూరి100 వ వర్ధంతి సందర్భంగా కొత్తవలస తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శ్రీ అల్లూరి పార్క్ వద్ద అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొత్తవలస తహసీల్దార్ నీలకంఠరావు మాట్లాడుతూ జాతీయోద్యమం జరుగుతున్న కాలంలో నర్సీపట్నం ఏజెన్సీ ప్రాంతంలో బ్రిటిష్ వారు చేస్తున్న దురాగతాలను ఎదిరించేందుకు శ్రీ అల్లూరి సీతారామరాజు 1917 లో మన్యంలో పితురి నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంప విప్లవం బ్రిటిష్ వారి వెన్నెల్లో దడ పుట్టించిన మహనీయుడు అల్లూరి సీతామరాజు అని తెలిపారు. 1922 నుండి 1924 వరకు సాయుధ పోరాటం జరిపి బ్రిటిష్ వారిని ఎదిరించేందుకు పలు పోలీస్ స్టేషన్లు ముట్టడి చేసి బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడిన మహనీయుడు అని తెలిపారు. 1924 మే 7వ తేదీన గిరిజనలు పడుతున్న ఇబ్బందులు చూసి మంప గ్రామం వద్ద అల్లూరి లొంగిపోవడంతో రాజేంద్రపాలెం వద్ద బ్రిటిష్ మూకర్లు చంపారన్నారు. అల్లూరి చేసిన త్యాగాలకు గుర్తుగా మన్యం అల్లూరి సీతారామ జిల్లాగా ఒక జిల్లాకు ప్రభుత్వం పేరు పెట్టి గౌరవించిందన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం అభినందనీయమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞత తెలుపుతున్నట్లు క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు ఎం గోపిరాజు తెలిపారు. అనంతరము స్వాతంత్ర్య సమరయోధుడు సిరివూరి గణేశ్వర రాజును తహసిల్దారు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పేద మహిళకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సునీత, ఈవో పీఆర్డి శ్రీదేవి, వీఆర్వోలు, క్షత్రియ సేవాసమితి సభ్యులు కమ్మెల్ల నాని బాబు రాజు, ముదునూరు గోపిరాజు, పిఎస్ వర్మ, ముదునూరి వర్మ, కమ్మెళ హరి రాజు, శ్రీను రాజు , గొట్టుముక్కల వరహాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఒకటవ డివిజన్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన...

## ఆర్ ఓ ప్లాంట్ నిర్మాణం, స్మశానవాటిక ఆధునీకరణకు శ్రీకారం...- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్...



రామగుండం:(జనం రిపోర్టర్) : రామగుండం:మే 07. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఒకటవ డివిజన్లో ప్రజల అవసరాల నిమిత్తం అభివృద్ధి పనులకు, ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించబడింది. ఇందులో భాగంగా తాగునీటి కోసం ఆర్ ఓ ప్లాంట్ నిర్మాణానికి, అలాగే స్మశానవాటిక ఆధునీకరణకు శాసన సభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారి తో పాటు అడిషనల్ కలెక్టర్ రామగుండం అరుణ శ్రీ , కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొంతల రాజేష్, రామగుండం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈదునూరి హరిప్రసాద్, నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్ పల్లికొండ రాజేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.."ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు, మరణానంతర సౌకర్యాలు, ప్రాథమిక హక్కులు, ఆర్ ఓ ప్లాంట్ ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించడమే కాకుండా, స్మశానవాటిక ఆధునీకరణతో మన సంస్కృతి, సంస్కారాలకు గౌరవం చేకూరుతుంది," అని



తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో ఆర్ ఓ ప్లాంట్ ప్రణాళిక పత్రాన్ని అధికారులతో కలిసి, పరిశీలిస్తూ స్థానికులకు వివరాలు తెలిపారు. అనంతరం స్మశానవాటిక అభివృద్ధికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ప్రజలకు శుభ్రమైన నీరు, మరణానంతర సమయంలో అవసరమైన సౌకర్యాలు సమర్థవంతంగా అందుబాటులోకి రానున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## వికారాబాద్ మున్సిపల్ పట్టణంలో ఎన్నెపల్లి చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన

# తెలంగాణ సభపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి..!!



వికారాబాద్ జిల్లా ప్రతినిధి(జనం రిపోర్టర్) : వికారాబాద్ మున్సిపల్ పట్టణ ఎన్నెపల్లి చౌరస్తాలో బుధవారం తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి దేశంలోని కోట్లాది మంది దళిత, గిరిజన, బహుజనులు తలేత్తుకుని బ్రతుకుతున్నారంటే ఆ దైర్యం పేరే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని తెలంగాణశాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఎనికేపల్లి కూడలీలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, తెలంగాణప్రభుత్వ చీఫ్ విప్ మహేందర రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, శాసన సభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, బి.మనోహర్ రెడ్డి, కాలే యాదయ్య లతో కలిసి భారత రత్న, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీంరావ్ అంబేద్కర్ 12 అడుగుల భారీ విగ్రహాన్ని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ....అంబేద్కర్ ఒక చరిత్ర కాదు నేటి వాస్తవానికి ప్రతీక అన్నారు. విద్యా, ఉద్యోగాలుదళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల ఆత్మబంధువు భారతరత్న డాక్టర్ భీం రావు అంబెడ్కర్ అన్నారు. వికారాబాద్ పట్టణ ముఖద్వారం ఎన్నేపల్లి చౌరస్తాలో బాబా సాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా మన వికారాబాద్ కు ఒక గౌరవం లభించిందని ఆయన పేర్కొన్నారు. విద్యా, ఉద్యోగాలు, రాజకీయ, సామాజిక రంగాలలో తమ వాటాను పొందుతూ, ప్రజాప్రతినిధులు




అవుతున్నామంటే అంటే దానికి కారణం అంబేద్కర్ అని పేర్కొన్నారు. తాను పడిన కష్టాలు, తాను అనుభవించిన బాధలను భవిష్యత్తులో తన జాతి పడకూడదని అంబేద్కర్ రిజర్వేషన్లు అనే బ్రహ్మాస్త్రాన్ని మనకు ఇచ్చారని స్పీకర్ తెలిపారు. అంబేద్కర్ సన్మార్గాన్ని చూపించారని, అట్టి దారిలో నడిచి మనం ఉన్నత స్థానాలను అందుకోవాలని స్పీకర్ సూచించారు. పూరి గుడిసెలో, దళిత వాడలలో, గిరిజన గూడేలలో పుట్టిన వారు కూడా దేశ అత్యున్నత పదవులు పొందుతున్నరంటే అంటే దానికి ఏకైక కారణం అంబేద్కర్ అందించిన రిజర్వేషన్లు అనే బ్రహ్మాస్త్రం అన్నారు. నేను శాసనసభ స్పీకర్ అయింది అంటే అంబెద్కర్ కల్పించిన రిజర్వేషన్ల బిక్షనే అన్నారు. అసమానతలు, అస్పృశ్యత సంకెళ్ళను చేదించి భారతదేశమే కాదు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన గొప్ప మేధావి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని స్పీకర్ కొనియాడారు. అంబెడ్కర్ ఎవరెస్టు శిఖరం లాంటి మేరు నగధీరుడని, అంబేద్కర్ అనేది ఒక పేరు కాదు, అది ఈ దేశ ప్రజల జీవన రేఖ అన్నారు. దళిత, బడుగు బలహీన వర్గాల జీవితాలకు వెలుగును ఇచ్చిన సూర్యుడని స్పీకర్ అన్నారు. అంబెద్కర్ వ్యక్తి గా కాదు ఒక శక్తిగా మనందరి శరీరాలలో ప్రవహిస్తున్నారని ఆయన అన్నారు. భూ ప్రపంచం ఉన్నంత వరకు అంబెద్కర్ పేరు ఉంటుందని, ఈరోజు ఢిల్లీ నుండి గల్లీ వరకు పార్లమెంట్ నుండి గ్రామ పంచాయతీ ల వరకు ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన సజావుగా జరుగుతున్నది అంటే దానికి కారణం అంబేద్కర్ రూపకల్పన చేసిన రాజ్యాంగమేనని ఆయన అన్నారు. అంబెద్కర్ ఒక కులానికో, మతానికో సంబంధించిన వారు కాదని వారు ఈ దేశ ప్రజల ఆస్థి అని స్పీకర్ తెలిపారు. తెలంగాణ గడ్డపై ప్రజాప్రభుత్వం ఉన్నంత కాలం దళిత, గిరిజన, బహుజన వర్గాలకు ఏ లోటూ ఉండదని, అంబేద్కర్ ఆలోచనకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన సాగుతుందని అన్నారు. దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని, ఎస్సీ ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్ లో 40 వేల 232 కోట్ల రూపాయలను కేటాయించిందని తెలిపారు. దళిత, గిరిజన, బీసీ బిడ్డలకు సంబంధించిన సంక్షేమ హాస్టల్ లో గతంలో ఎప్పుడూ లేని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 200 శాతం కాస్మొటిక్, 40 శాతం మెస్ చార్జీలను పెంచిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని దీనితో పేద దళిత, గిరిజన, బీసీ వర్గాల పిల్లలకు న్యాయం జరుగుతుందని ఆయన చెప్పారు. రాజ్యాంగం కింద మనం ఎలా స్వేచ్ఛగా బతుకున్నామో, బాబా సాహెబ్ అంబెడ్కర్ కల్పించిన రిజర్వేషన్లతో మనం ఎలా లబ్ధి పొందుతున్నామో భవిష్యత్తు తరాలకు కూడా తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పీకర్ తెలిపారు. అంబేద్కర్ పోరాట స్ఫూర్తితో నేటి యువత తమ జీవిత లక్ష్యాలను సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని స్పీకర్ ఆకాంక్షించారుఅంబేద్కర్ ఈ దేశ దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలకు ఒక కాగడా లాగా వెలుగును పంచుతున్నారని, ఆ వెలుగులో మనం విజయం అనే గమ్యాన్ని అందుకోవాలని అప్పుడే అంబేద్కర్ నిజమైన నివాళు లర్పించిన వారమవుతామని స్పీకర్ పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... దేశానికి దిక్సూచి చూపిన మహానుభావుడు బాబా సాహెబ్ అంబేద్కర్ అన్నారు. అన్ని రంగాల్లో ప్రావిణ్యం కలిగి ఉండడం వల్లనే దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగ రచనకు ఆయన సేవలు తీసుకోవడం జరిగిందనీ తెలిపారు.

### ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ...

బాబా సాహెబ్ అంబేద్కర్ ను యువత స్ఫూర్తిగా తీసుకొని, వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. మహనీయుల విగ్రహాలను స్థాపించుకుంటున్నామంటే వారి యొక్క త్యాగం, సేవలను ముందు తరాలు తెలుసుకునేందుకు అని ఆయన అన్నారు. మహనీయుల కన్న కళలను నిజం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు.

### ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ...

సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు తన జీవితకాలం పోరాడిన మహా వ్యక్తి బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ వారసులుగా తమ జీవిత శైలిని మార్చుకుంటూ హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తు బాగుండాలనే వారి ఆకాంక్షను నెరవేర్చాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. బాబా సాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన అనంతరం ఏపూరి సోమన్న బృందం ఆలపించిన సామాజిక స్పృహ, ఓటు హక్కు, అక్షరమే ఆయుధంగా మలుచుకొని ఆశయ సాధనకు ముందుకు వెళ్లాలి అనే పాటలు ఆహుతులను ఎంతగానో ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో వికారాబాద్మాజీ ఎమ్మెల్యే మెతుకుఆనంద్, ఆర్థిక కమిటీ సభ్యులు రమేష్ మహారాజ్, డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టిఏ మెంబర్ జాఫర్, దిశ కమిటీ సభ్యులు వడ్ల నందు, విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు, స్థానిక వివిధ రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో కంపోస్ట్ యార్డ్ దగ్ధం.



పొన్నూరు (జనం రిపోర్టర్) : పొన్నూరు మండలంలోని చింతలపూడి గ్రామం శివారు పొలాలలో మొక్కజొన్న వ్యర్థాలను తగలబెడుతుండగా ప్రమాదవశాత్తు మంటలు ఎగిసిపడి గ్రామ కంపోస్ట్ యార్డ్ లో పడ్డాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా అగ్నిమాపక శాఖ అధికారి ప్రసాదరావు సిబ్బందితో వెళ్లి మంటలను అదుపు చేయటంతో పాటు పక్కనే ఉన్న రైతు కుంభ శ్రీనివాసరావు మొక్కజొన్న పంటను కాపాడారు. సకాలంలో స్పందించిన అగ్నిమాపక సిబ్బంది నీ గ్రామ ప్రజలు అభినందించారు.

# వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం లో గురుపూజ ఉత్సవాలు



చొప్పదండి(జనం రిపోర్టర్) : పట్టణంలోని శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురు పూజ ఉత్సవాల సందర్భంగా బుధవారం రోజు పట్టణంలోని శ్రీ రమా సత్యనారాయణ వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటుగా అనేక మంది భక్తులు కాలజ్ఞాన రచయిత వీర బ్రహ్మేంద్రస్వామి ని దర్శించుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు



చొప్పదండి, (జనం రిపోర్టర్) : చిరు దాన్యాలను రోజు వారి దిన చర్యలో భాగంగా ఆహారంగా తీసుకోవాలి. చిరుధాన్యాలను మనం అనేక రకాలుగా వండుకొని తినడం వలన మన శరీరానికి శక్తితోపాటు రోగనిరోదక శక్తిని పెంపొందిస్తాయని తాజామాజీ ఎం పి పి చిలుక రవీందర్ అన్నారు. మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో జీవన్ ఆధార్ సొసైటీ వారి ఆద్వర్యంలో " చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు" నిర్వహంచారు. ఈ కార్యక్రమానికి తాజామాజీ ఎం పి పి చిలుక రవీందర్ హాజరై వారు చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరిస్తూ చిరుధాన్యాలు రాగులు, సజ్జలు, కొర్రలు,మినుములు, ఉలవలు, పెసలు, జొన్నలు మొదలగు తృణధాన్యాలను మనమే మన ఇంటిపెరట్లో సాగుచేసుకోవాలి. మన చేళ్ళలో పండించుకున్న చిరుధాన్యాలను మనం అనేక రకాలుగా వండుకొని తినడం వలన మన శరీరానికి శక్తితోపాటు రోగనిరోదక శక్తిని పెంపొందిస్తాయి. రోజులో ఒకపూట చిరుధాన్యాలకు సంబందించిన ఆహార పదార్థాలను తినడం అలవాటు చేసుకుంటే తరచూ పెద్దపెద్ద జబ్బులు రాకుండా ఆరోగ్యంగా వుంటామని తెలియజేసారు. జీవన్ ఆధార్ సొసైటీ ప్రతినిధి సాకూర్భాయి మాట్లాడుతూ.. మనం నిత్యం తినే ఆహారం వలనే మనకు వివిద రకాల జబ్బులు వస్తున్నాయి వాటినుండి మనల్ని మనం రక్షించుకోవడం కోసం నేటి నుండి ఒకపూట చిరుధాన్యాల ఆహారాన్ని తీసుకొని మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాదిహామి ఫీల్డ్ అసిస్టెంట్ అంజలీ దేవి, జాతీయ ఉపాదిహామి సిబ్బంది,గ్రామ ప్రజలు మొదలగువారు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రామ టిడిపి అధ్యక్షుడు జన్మదిన వేడుకలు



మొగల్తూరు మే 7 జనం రిపోర్టర్: మొగల్తూరు గ్రామ టిడిపి అధ్యక్షుడు బొల్లా నారాయణ విఠల్ (చంటి) జన్మదిన వేడుకలు స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం టిడిపి ఇన్చార్జ్ రామరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బొల్లా చంటి చేత బర్త్ డే కేక్ కట్ చేయించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ టిడిపి పార్టీకి విశేష సేవలు అందించాలని మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయన కొనియాడారు. పలువురు టీడీపీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, కలిదిండి కుమార్ బాబు, మామిడి శెట్టి సత్యనారాయణ, పాలా.రాంబాబు, గుండు రాజా కొల్లాటి.భోగరాజు, దేశం శెట్టి శ్రీను, డొల్ల రత్నారాజు, పొన్నపల్లి శివ తదితరులు పాల్గొన్నారు

EDITOR, PRINTER, PUBLISHER AND OWNED BY SIRASALA SURESH KUMAR, Printed at M/S MARPU PUBLICATION,# /639-1-7-15, NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPATRI-515 411, Ananthapuramu Dist., (A.P.), PUBLISHED AT # 1/639-1-7-15, NANDYAL ROAD,CPI COLONY, 4TH ROAD,TADIPATRI-515 411,Ananthapuramu Dist.,(A.P.). Cell:9398156948,REG.RNI: APTEL/2023/86845, E-Mail:janamnews19@gmail.com